# ప్రజాశక్తి

శనివారం 6 డిసెంబర్ 2025 8 పేజీలు

గుంటూరు

పల్నాడు

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నిర్వహణపై కొరవడిన పర్యవేక్షణ

### విధుల నిర్వహణపై ప్రభుత్వ విధానంలోనే లోపాలు - గణపవరంలో 12 మంది సస్పెన్షన్ కలకలం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు, పల్నాడు జిల్లాల్లో రూరల్, అర్బన్ పిహెచ్‌సిలపై పర్యవేక్షణ తగ్గింది. పిహెచ్‌సిలలో వైద్య సేవలు పూర్తి స్థాయిలో ఉండటం లేదు. కేవలం ప్రాథమిక చికిత్సలకే పిహెచ్‌సిల వైద్యులు, సిబ్బంది పరిమితం అవుతున్నారు. పిహెచ్‌సిలు అన్ని ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పనిచేస్తున్నాయి. సాయంత్రం 4 గంటల తరువాత వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండటం లేదు.

తాజాగా నాదెండ్ల మండలం గణపవరంలో సాయంత్రం 4 గంటల తరువాత పిహెచ్‌సికి తాళం వేయడంపై ప్రభుత్వం సీరియస్ అయింది. వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ వీరపాండ్యన్ రెండురోజుల క్రితం గణపవరం పిహెచ్‌సిని ఆకస్మికంగా తనిఖీకి వచ్చారు. ఈ సందర్భంలో పిహెచ్‌సికి తాళం వేసి ఉంది. దీంతో ఆయన సీరియస్ అయ్యారు. ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. వెంటనే పిహెచ్‌సిలో పనిచేస్తున్న ఇద్దరు డాక్టర్లతో సహా 12 మందిని సస్పెండ్ చేశారు. ఈమేరకు వైద్య ఆరోగ్య శాఖ డైరెక్టర్ పద్మావతి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. అయితే ఇద్దరు డాక్టర్ల డ్యూటీ సమయం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకేనని వైద్య

తాళం వేసి ఉన్న గణపవరం పిహెచ్‌సి

అధికారులు చెబుతున్నారు. అలాగే శెలవులో ఉన్న వారిని కూడా సస్పెండ్ చేశారని ఉద్యోగులు వాపోయారు. వాస్తవంగా గత 24 గంటలు పనిచేయాల్సిన పిహెచ్‌సిలను ఉదయం 9 గంటలనుంచి 4 గంటల వరకు పరిమితం చేస్తూ గత ప్రభుత్వ హయంలో నిర్ణయం తీసుకున్నారు. మొత్తం 24 గంటల కాల వ్యవధిలో ముగ్గురు స్టాఫ్ నర్సులు 8 గంటల చొప్పున విధులు నిర్వహించాల్సి ఉంది. రాత్రి వేళ విధులు నిర్వహించాల్సిన స్టాఫ్ నర్సులు ఇళ్ల వద్ద నుంచి పనిచేస్తున్నారు. పిహెచ్‌సిలలో తమకు భద్రత లేదని వారు చెబుతున్నారు. దీంతో రాత్రి వేళ విధులు ఇళ్ల నుంచి మొక్కుబడిగా జరుగుతున్నాయి. ఎవైనా కేసు వస్తే జిల్లా ఆస్పత్రులకు వెళ్లమని సలహా ఇచ్చి వారు తప్పుకుంటున్నారు. గత ఐదేళ్లగా ఈ తంతు జరుగుతోంది. రాత్రి వేళ ఎక్కువ కేంద్రాల్లో డాక్టర్లు పిహెచ్‌సిలకు రావడం లేదు. దీంతో అత్యవసర పరిస్థితుల్లో స్టాఫ్ నర్సులు మందులు ఇచ్చి మరుసటి రోజు రమ్మని సలహా ఇవ్వడం,దగ్గర లోని పెద్దాసుపత్రికి వెళ్లమని చెప్పడం పరిపాటిగా మారింది. కొన్ని సందర్భాల్లో రాత్రి వేళ డెలివరీ కేసుల్లో కూడా సంబంధిత మహిళ, వారు కుటుంబ సభ్యులు కూడా ఇబ్బంది పడుతున్నారు. రాత్రి వేళ ఎక్కువ మంది గుంటూరు జనరల్ ఆస్పత్రి, నరసరావుపేట, తెనాలి జిల్లా ఆస్పత్రులకు వెళ్లాల్సి వస్తోంది. దూర ప్రాంత వాసులకు ఈ మూడు ఆస్పత్రులకు చేరుకోవడం ఇబ్బందిగా మారుతోంది. గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిపై వత్తిడిని తగ్గించేందుకు అర్బన్ పిహెచ్‌సిల పనితీరును మెరుగుపర్చాలని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఆదేశించినా అధికారులలో చలనం లేదు. ఈ అంశంపై జిల్లా స్థాయిలో ఇప్పటి వరకు ఎటువంటి సమీక్షలు కూడా లేవు. పిహెచ్‌సిలు, అర్బన్ పిహెచ్‌సిలలో మౌలిక వసతులు, చాలినంత మంది సిబ్బంది,వైద్యులు లేకపోవడం వల్ల గ్రామాల నుంచి ఎక్కువ మందిని గుంటూరు, తెనాలి, నర్సరావుపేటకు పంపక తప్పడం లేదని అక్కడి వైద్యులు, సిబ్బంది చెబుతున్నారు. గుంటూరులో 16 అర్బన్ పిహెచ్‌సిలు ఉండగా రాత్రి వేళ సేవలు ఉండటం లేదు.

విద్యార్థులు, తల్లితండ్రులతో భోజనం చేస్తున్న మంత్రి మనోహర్, కలెక్టర్, సబ్‌కలెక్టర్, డిఇఒ

## ప్రపంచంతో పోటీ పడేలా చదువులుండాలి

- తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశంలో మంత్రి మనోహర్
- అంగలకుదురు జెడ్‌పి పాఠశాలలో ల్యాబ్, లైబ్రరీకి ప్రారంభోత్సవం

ప్రజాశక్తి-తెనాలిరూరల్

విలువలైన చదువు వ్యర్థమని, అధునాతన సాంకేతికతలు అందిపుచ్చుకొని నేటి ప్రపంచంతో విద్యార్థులు పోటీ పడాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా శుక్రవారం నిర్వహించిన విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశంలో భాగంగా తెనాలి మండలం అంగలకుదురు జెడ్‌పి పాఠశాల సమావేశానికి మంత్రి మనోహర్ హాజరయ్యారు. పాఠశాలలో రూ.38.68 లక్షల నిధులతో నిర్మించిన కెమిస్ట్రీ ల్యాబ్, గ్రంథాలయాన్ని జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, సబ్ కలెక్టర్ సంజన సిన్హా, డిఇఒ సి.వి రేణుకతో కలిసి మంత్రి ప్రారంభించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులతో ముచ్చటించారు. మూడవ తరగతి విద్యార్థిని శాస్త్రి ఆంగ్లంలో మాట్లాడిన తీరు అందరినీ ఆకర్షించింది. అనంతరం మంత్రి మనోహర్ మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచానికి అవసరమైన ఉత్తమ బోధన పద్ధతులను అవలంబించాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యతో పాటు గ్రామాభివృద్ధి కార్యక్రమాలను మెరుగుపరిచే విధంగా విద్యార్థులను తీర్చిదిద్దే బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. పిల్లల్లో మనోధైర్యాన్ని పెంచాలన్నారు. పాఠశాలల్లో సౌకర్యాలు మెరుగుపర్చామని, వాటిని ఉపయోగించుకుని తల్లిదండ్రుల ఆశలను, కలలను నెరవేర్చాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. తొలత ఎన్‌సిసి క్యాడెట్ల గౌరవవందనాన్ని మంత్రి స్వీకరించగా సర్పంచ్, ఉప సర్పంచ్ కనగాల నాగభూషణం స్వాగతం పలికారు. డిడివో కుసుమ శ్రీదేవి, సమగ్ర శిక్షణ పిఎంసిఐ పద్మావతి, తహశీల్దార్ గోపాలకృష్ణ, ఎంఇఒలు ఎం.లక్ష్మీనారాయణ, జయంతిబాబు పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద అధికారికి వినతిపత్రం ఇస్తున్న విఆర్ఎలు, నాయకులు

## విఆర్ఎలకు పే స్కేల్ అమలు చేయాలి

### అక్రమ డ్యూటీలను రద్దు చేసి ప్రమోషన్లు ఇవ్వాలి - కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

గ్రామ స్థాయిలో ప్రజలతో నిత్యం సంబంధాలు కలిగి, రెవెన్యూ వ్యవస్థలో కీలకంగా వ్యవహరిస్తున్న తమ సమస్యలను పరిష్కరించాలని గ్రామ రెవెన్యూ సహాయకులు (విఆర్ఎ) డిమాండ్ చేశారు. ఈ మేరకు నరసరావుపేటలోని కలెక్టరేట్ ఎదుట శుక్రవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఎపి గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ రూ.6500గా ఉన్న విఆర్ఎల వేతనాలను 2018లో సిఎం చంద్రబాబు రూ 10,500కు పెంచారని, రూ.300 డిఎ అమలు చేస్తే 2019లో అధికారంలోకి వచ్చిన వైసిపి ఆ డిఎను ఉపసంహరించడంతోపాటు తిరిగి వసూలు చేసిందని అన్నారు. ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా విఆర్ఎల సమస్యలను పట్టించుకోవడం లేదని అన్నారు. తెలంగాణలో విఆర్ఎలకు పేస్కేల్ అమలు చేస్తుండగా ఇక్కడ మాత్రం 8 ఏళ్లుగా జీతాలు పెరగలేదని, దీనికోసం ప్రజాప్రతినిధులు, అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని విమర్శించారు. అర్హులైన వీఆర్ఎలు ఎప్పటికైనా వీఆర్ఓగా ప్రమోషన్ వస్తుందని నిరీక్షిస్తున్నా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, మరోవైపు విఆర్ఎలకు వయోభారం పెరుగుతోందని ఆవేదన వెలిబుచ్చారు. అటెండర్, నైట్ వాచ్మెన్ ప్రమోషన్లను 70 శాతానికి పెంచాలని, అక్రమ, అదనపు విధులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టరేట్‌లో కార్యనిర్వాహణ అధికారికి వినతిపత్రం అందజేశారు. నాయకులు సంజీవరావు, సుబ్బారావు, జి.వెంకటలక్ష్మి, రవి, మునాఫ్, దేశిపతి, మురళి, బాజీ, అంకమ్మ పాల్గొన్నారు.

## లారీ కిందపడి విద్యార్థిని మృతి

### పరీక్ష రాసి వెళ్తుండగా ప్రమాదం

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

మండలంలోని కుంచనపల్లి జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో విద్యార్థిని మృత్యువాత పడ్డారు. మచిలీపట్నంకు చెందిన సుమయ (18) నీరుకొండ ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో బిబిఎ మొదటి సంవత్సరం చదువుతున్నారు. శుక్రవారం కాలేజీకి వెళ్లి పరీక్ష అనంతరం స్నేహితుని ద్విచక్ర వాహనంపై వస్తుండగా జాతీయ రహదారిపై మద్రాస్ కాల్వ బ్రిడ్జిపైకి రాగానే లారీని ద్విచక్ర వాహనం దాటే క్రమంలో లారీకి తగిలింది. దీంతో బైక్ వెనకనున్న సుమయ కిందపడడం, తలపైకి లారీ ఎక్కడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందారు. బైక్‌ను నడుపుతున్న విద్యార్థి స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. ఘటనా స్థలిని తాడేపల్లి ఎస్సై ఖాజావలి పరిశీలించి లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మంగళగిరి ఎయిమ్స్‌కు తరలించి కేసు నమోదు చేశారు.


పరిమితుల్లేకుండా ధాన్యం మొత్తాన్నీ కొనాలి

రైతుసంఘం డిమాండ్ -4లో


## వైద్యవిద్యార్థుల ఆశల్ని వమ్ము చేసిన ప్రభుత్వం

### 21వ తేదీన విజయవాడలో రాష్ట్ర సదస్సులో కార్యాచరణ ప్రకటన

ప్రజాశక్తి-గుంటూరు

గత ప్రభుత్వ హయాంలో ప్రారంభమైన 5 వైద్య కళాశాలలకు నేషనల్ మెడికల్ కమిషన్ కేటాయించిన 60 పోస్ట్ గ్రాడ్యుయేషన్ సీట్లను ప్రతిభ ఆధారంగా కాకుండా ఒక్కో పీజీ సీటును ఏడాదికి రూ.9 లక్షల నుండి రూ.29 లక్షలకు స్వయానా ప్రభుత్వమే అమ్మకానికి పెట్టడం ప్రతిభ గల పేద వైద్యవిద్యార్థుల ఆశలను వమ్ము చేయడమేనని ప్రభుత్వ మెడికల్ కళాశాలల పరిరక్షణ కమిటీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం రామన్నపేటలోని జనచైతన్య వేదిక హాలులో జరిగిన ప్రభుత్వ మెడికల్ కళాశాలల పరిరక్షణ కమిటీ రాష్ట్ర సమావేశంలో వివిధ అంశాలపై చర్చించారు. డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గత ప్రభుత్వం అమలు చేసిన 107, 108 జీవోలను నాడు వ్యతిరేకించిన చంద్రబాబు, లోకేష్, పవన్ కల్యాణ్ నేడు వాటిని రద్దు చేయకపోగా, వాటికి కేటాయించిన పీజీ సీట్లను అమ్మకానికి పెట్టిందని విమర్శించారు. 60 పీజీ సీట్లలో సగం సీట్లు ఆలిండియా కోటాకు పోగా, మిగిలిన 30 సీట్లలో 15 సీట్లు పేమెంట్ సీట్లగా మార్చడం వల్ల రాష్ట్ర విద్యార్థులకు కేవలం 15 సీట్లు మాత్రమే మిగులుతున్నాయని చెప్పారు. పీపీపీ విధానంలో ప్రైవేట్ యాజమాన్యాలకు ఇప్పటికే ఒక్కొక్క కళాశాలకు 50 ఎకరాలకుపైగా భూములు, నిర్మాణంలో ఉన్న భవనాలు, అనుమతులను ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వం నేడు రాబోయే రెండేళ్లపాటు వైద్యులు, ఇతర సిబ్బంది జీతభత్యాలను చెల్లించటానికి అంగీకరిస్తూ 847 జీవోను విడుదల చేయడం ద్వారా ప్రజల సంపదను ప్రైవేట్ వ్యక్తులకు దోచిపెట్టడమేనని విమర్శించారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలల పరిరక్షణ కమిటీ రాష్ట్ర కో-కన్వీనర్లు కొరివి వినయ్ కుమార్, వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ పీపీపీ విధానంలో ప్రభుత్వ మెడికల్ కళాశాలలను నిర్వహించడాన్ని వ్యతిరేకిస్తున్న రాజకీయ పార్టీలను, విద్యార్థి యువజన సంఘాలను, సామాజిక, పౌర సంఘాలను ఆహ్వానించి ఈనెల 21వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు విజయవాడ నగరంలో రాష్ట్ర సదస్సును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సదస్సులో భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. సమావేశంలో జనచైతన్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. ధనుంజయరెడ్డి పాల్గొన్నారు.

## క్లాప్ ఆటో డ్రైవర్లకు రూ.24 వేల వేతనం ఇవ్వాలి :

**ప్రజాశక్తి - మంగళగిరి**

క్లబ్ ఆటో డ్రైవర్లకు నెలకు 24 వేల రూపాయలు వేతనం ఇవ్వాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ ఎస్ చెంగయ్య అన్నారు. శుక్రవారం రాత్రి మంగళగిరి సిఐటియు కార్యాలయంలో క్లాప్ ఆటో డ్రైవర్ల యూనియన్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి యూనియన్ అధ్యక్షులు డి శివ అధ్యక్ష వహించారు. ఎస్ ఎస్ చెంగయ్య మాట్లాడుతూ జీవో ప్రకారం వేతనాలు చెల్లించడం లేదని అన్నారు. స్వఛ్ఛాంధ్ర కార్పొరేషన్ నుంచి క్లాప్ ఆర్డర్ డ్రైవర్లను మున్సిపల్ ఆటోడ్రైవర్లుగా తీసుకోవాలని కోరారు. ఈఎస్ఐ, పిఎఫ్ చెల్లించాలని డిమాండ్ చేశారు. సిఐటియు జాతీయ మహాసభలను జయప్రదం చేయడానికి కృషి చేయాలని కోరారు. సమావేశంలో సిఐటియు పట్టణ కార్యదర్శి ఎం.బాలాజీ, యూనియన్ కార్యదర్శి రవి పాల్గొన్నారు.

## వాహన చోదకులు నిబంధనలు పాటించాలి

**ప్రజాశక్తి - తెనాలి :** వాహన చోదకులు రవాణాశాఖ నిబంధనలను కచ్చితంగా పాటించాలని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ టి. రాఘవరావు అన్నారు. పట్టణంలో శుక్రవారం ఆయన వాహనాల తనిఖీలు నిర్వహించారు. పలు ద్విచక్ర వాహనాలపై ముగ్గురు, నలుగురు ప్రయాణించడం, అధిక శాతం మైనర్లు ద్విచక్ర వాహనాలను అధిక స్పీడుతో నడపడం, పాఠశాలకు పిల్లలను తరలించే క్రమంలో ఒక్కో బండి పై ముగ్గురు, నలుగురిని ఎక్కించుకొని తీసుకువెళ్లడం గమనించారు. లైసెన్స్ లేకుండా వాహనాలను నడిపితే రూ. 14,500 వరకు అపరాధ రుసుము చెల్లించాల్సి ఉంటుందని ఎంవీఐ హెచ్చరించారు. అదేవిధంగా మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే వాహనాన్ని సీజ్ చేస్తామన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వకుండా తల్లిదండ్రులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. సుమారు 17 వాహనాలకు జరిమానా విధించినట్లు రాఘవరావు తెలిపారు.

## డాక్టర్ ధూళిపాళ్ల భరత్‌కు జాతీయ స్థాయి అవార్డు

**ప్రజాశక్తి-పిడుగురాళ్ల :** ఐఎంఎ పిడుగురాళ్ల శాఖ అధ్యక్షులు డాక్టర్ దూళిపాళ్ల భరత్ కుమార్‌కు జాతీయస్థాయి గౌరవం దక్కిందని ఐఎంఎ నేషనల్ ప్రెసిడెంట్ అప్రిషేషన్ అవార్డు దక్కిందని శుక్రవారం ఆయన ఒక ప్రకటనలో తెలియజేశారు. దేశవ్యాప్తంగా ఉన్న శాఖ అధ్యక్షుల్లో విశిష్ట నాయకత్వం,సభ్యుల సమన్వయం మరియు శాఖ అభివ అద్ధిలో చూపిన సేవలను గుర్తించి ఈ అవార్డు ప్రకటించారని అన్నారు. ఈనెల 27వ తేదీన అహ్మదాబాద్ నందు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ నేషనల్ కానారేన్స్ 2025 ,86వ వార్షిక సెంటర్ కౌన్సిల్ మీటింగ్ నందు ఈ అవార్డు పొందనున్నట్లు ఆయన తెలిపారు.

## 13న జాతీయాలోక్ అదాలత్

**ప్రజాశక్తి-పిడుగురాళ్ల :** ఈనెల 13న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు మండల న్యాయ సేవాధికార సంస్థ, పిడుగురాళ్ల వారి ఆధ్వర్యంలో స్థానిక సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) కోర్టు ప్రాంగణంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లుగా మండల న్యాయ సేవాధికార సంస్థ పర్సన్ కం సివిల్ జడ్జి జూనియర్ డివిజన్ టి. ప్రవళిక శుక్రవారం కోర్టు ఆవరణలో నిర్వహించిన సమావేశంలో తెలిపారు.

# నొప్పి అని బాధపడుతున్న యువతిని కొట్టిన వైద్యులు

- నిర్లక్ష్యంగా వ్యవహరించిన వైద్యులను తొలగించాలి
- ఏరియా హాస్పిటల్ అక్రమాలపై విచారణ జరిపించాలి : డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి

**ప్రజాశక్తి-పల్నాడు జిల్లా**

విలేకర్లతో మాట్లాడుతున్న డాక్టర్ శ్రీనివాసరెడ్డి.. మహిళ శరీరం నుండి తొలగించిన సర్జికల్ బ్లేడు

కుటుంబ నియంత్రణ ఆపరేషన్ కోసం ప్రభుత్వ వైద్యశాలకు వచ్చిన యువతి వద్ద అక్రమంగా రూ.2500 వసూలు చేయడంతో పాటు చికిత్స చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించి యువతి శరీరంలో సర్జికల్ బ్లేడు వదిలేసిన వైద్యులను సస్పెండ్ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని వైసిపి పల్నాడు జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టణంలోని బాలయ్య నగర్ కు చెందిన యువతి రమాదేవి కుటుంబ నియంత్రణ ఆపరేషన్ కోసం గత నెల 26 న ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో చేరగా ఆమెకు ఆపరేషన్ చేసిన వైద్యులు సర్జికల్ బ్లేడ్‌ను శరరంలోనే వదిలేయడం దారుణమన్నారు. ఆపరేషన్ అనంతరం కాలు భరించలేని నొప్పి వస్తుందని బాధపడుతూ వైద్యులకు చెప్పినా పట్టించుకోలేదని పైగా నొప్పి ఉంటుందని యువతి చెంపపై కొట్టారన్నారు. కాలు వాపు రావడంతో ప్రైవేట్ హాస్పిటల్‌కి వెళ్లి ఎక్స్‌రే తీయగా తొడ భాగంలో సర్జికల్ బ్లేడ్ ఉన్నట్లు గుర్తించారన్నారు. ఆపరేషన్ సమయంలో నొప్పి ఎక్కువగా ఉంది, బాధగా ఉందని పేషెంట్ చెబితే డాక్టర్ పేషెంట్ చెంపపై రెండుసార్లు కొట్టాడన్నారు. సర్జరీ అనంతరం తొడ దగ్గర గుచ్చుకుంటుందని పేషెంట్ చెప్పిన వైద్యులు పట్టించుకోలేదన్నారు. ఎక్స్‌రే మిషన్, ఆల్ట్రా సౌండ్ స్కానింగ్ మిషన్ లేదని, ఇవన్నీ బయట చేయించుకోవాలని పేషెంట్లకు సూచిస్తున్నారన్నారు. బయట స్కానింగ్ సెంటర్లు, ఎక్స్‌రే ప్లాంట్లు ఎమ్మెల్యే అనుచరులు నిర్వహిస్తున్నారని, ప్రభుత్వ ఆసుపత్రిలో చేయాల్సిన పరీక్షలు బయటకు పంపించి పేదలను దోపిడి చేస్తున్నారన్నారు. ఆసుపత్రి చైర్మన్, శస్త్ర చికిత్స చేసిన డాక్టర్, ఎమ్మెల్యేకు మంచి సాన్నిహిత్యం ఉందన్నారు. సదరన్ సర్టిఫికెట్ మంజూరు కోసం రూ .25 వేల నుంచి రూ.30 వేలు వసూలు చేస్తున్నారని, అందులో ఎమ్మెల్యే కు వాటా ఉందని ఆరోపించారు. ఆసుపత్రికి కావాల్సిన కాటన్, ఇంజక్షన్లను బయట నుండి తెప్పించి వైద్యులు కమిషన్లు దండుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫ్యామిలీ ప్లానింగ్ ఆపరేషన్ చేయించుకున్న మహిళకు కేంద్ర, ప్రభుత్వ పథకం కింద రూ 400, ఆశా వర్కర్‌కు రూ.600 ఇవ్వాల్సి ఉండగా ఇవ్వడం లేదన్నారు. ఏరియా వైద్యశాలలో ఎమ్మెల్యే అనుచరుల కనుసన్నలలో అక్రమాలు జరుగుతున్నాయని అన్నారు. బాధిత యువతి రమాదేవికి నష్టపరిహారం అందించాలని, కేంద్ర ప్రభుత్వ ఇంటెన్సివ్స్ ఇవ్వాలని కలెక్టర్‌ను కోరతామని చెప్పారు.

# ఫ్రెండ్లీ చైల్డ్ మీడియా గ్రూప్ ఏర్పాటు చేయాలి

**ప్రజాశక్తి - తాడేపల్లి**

గుడ్ షెఫర్డ్ కాన్వెంట్ సిస్టర్స్ స్వఛ్ఛరేద సంస్థ వారి చైల్డ్ ప్రొటెక్షన్ ప్రాజెక్ట్‌లో భాగంగా తాడేపల్లి, మంగళగిరి, తుళ్ళూరు, పెదకాకాని మండలాల్లోని మీడియా ప్రతినిధులతో శుక్రవారం సమావేశం ఏర్పాటు చేశారు. చైల్డ్ ప్రొటెక్షన్ ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ సిస్టర్ విద్యా మాట్లాడుతూ బాలలు చాలా అడ్వాన్స్ గా ఉంటున్నారని, టెక్నాలజీ పెరుగుతున్న కొలది పిల్లలు కంప్యూటర్‌తో పోటీ పడి జీవిస్తున్నారని, మీడియా మిత్రులు కూడా ఆలోచించి ఫ్రెండ్లీ చైల్డ్ మీడియా గ్రూప్ ఏర్పాటు చేస్తే బాగుంటుందని చెప్పారు. దీని ద్వారా పిల్లలు వారి భావాలు సమాజానికి తెలియజేసే అవకాశం ఉంటుందని చెప్పారు. గుడ్ షెఫర్డ్ సుపీరియర్ సిస్టర్ మెర్సీజార్జి మాట్లాడుతూ బాలలు చాలా సులువుగా మోసపోతున్నారని, నేరాలు చేసే జాబితాలో పిల్లలు ఎక్కువగా ఉంటున్నారని ఆవేదన వెలిబుచ్చారు. చాలా మంది మైనర్ బాలురు మత్తు పదార్థాలకు అలవాటు పడి జీవితాలు నాశనం చేసుకుంటున్నారని, వారిని మార్చాలని చెప్పారు. కార్యక్రమంలో గుడ్ షెఫర్డ్ సిబ్బంది కె.అనూష, పి.అనిల్ కుమార్, బుజ్జి, ఇశ్రాయేల్, నాగమణి, బి.విజయలక్ష్మి, ఎ.పోతురాజు పాల్గొన్నారు.

## ఎఎంరెడ్డి కాలేజీలో ఘనంగా అంతర్జాతీయ వాలంటీర్స్ దినోత్సవం

**ప్రజాశక్తి-పల్నాడు జిల్లా**

నరసరావుపేట మండలం పెట్లూరివారిపాలెం గ్రామంలో గల ఏఎంరెడ్డి స్మారక పార్మసీ కళాశాలలో శు క్రవారం అంతర్జాతీయ వాలంటీర్స్ దినోత్సవం సందరరేగా ఏఎంరెడ్డి ఇన్నోవేషన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వ్యర్ధాల నుండి ఉపయోగమైన ఉత్పత్తుల తయారీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొని వివిధ వ్యర్ధాల నుండి పలు ఉపయోగకరమైన వస్తువులను, రసాయనాలను వివిధ రూపాలలో నమూనాల ఆధారంగా ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిదిగా పల్నాడు జిల్లా స్కిల్ డెవలప్మెంట్ అదికారి తమ్మాజీరావు పాల్గొని విద్యార్థుల ప్రదర్శించిన నమూనాలను పరిశీలించి తగు సూచనలు చేశారు. తమ్మాజీరావు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో విద్యా సంస్థల పాత్ర ఎంతో ముఖ్యమన్నారు. ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో ఆవిష్కరణాత్మక ఆలోచనలకు దారితీస్తాయని అన్నారు. కళాశాల కార్యదర్శి అట్లూరి శాంతి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ పెరుగుతున్న ఆదునికత ఆధారంగా పరిశ్రమలు, గ హాల నుండి వస్తున్న వ్యర్థాలతో ఉపయోగకరమైన, విలువైన వస్తువులను తయారు చేసుకోనే ప్రక్రియ జరగాలన్నారు.అందుకు విద్యార్థి దశ నుండే ఇటువంటి స జనాత్మకమైన కార్యక్రమాల ఆసక్తి చూపాలన్నారు. విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.భార్గవ్ భూషణ్ రావు, అధ్యాపకులు పావని, ఎం. మురళీ కృష్ణ, విభాగాధిపతులు పాల్గొన్నారు.

## ప్రాంగణ ఎంపికల్లో ఎంఎఎం విద్యార్థినిలకు ఉద్యోగాలు

**ప్రజాశక్తి-పల్నాడు జిల్లా**

తమ కళాశాలలో శుక్రవారం బెంగళూరుకు చెందిన ప్రముఖ సంస్థ ట్యాప్ అకాడమీ శుక్రవారం నిర్వహించిన ప్రాంగణ ఎంపికలలో 3 విద్యార్థినిలు ఉద్యోగాలు సాదించారని కళాశాల డైరెక్టర్ దరువూరి శ్రావ్య తెలిపారు. వ్రాత పరీక్ష, గ్రూప్ డిస్కషన్, వ్యక్తిగత ఇంటర్వ్యూ ద్వారా కంప్యూటర్ సైన్స్ విభాగానికి చెందిన ఫైనల్ ఇయర్ విద్యార్థులు భవ్యశ్రీ, పుష్పలత, అనితలు సాఫ్ట్వేర్ డెవలప్మెంట్ ఇంజనీర్స్ గా ఎంపికైనట్లు ఆమె తెలి పారు. కళాశాల చైర్మన్ మేదరమెట్ల శేషగిరిరావు మాట్లాడుతూ నూతన సంవత్సరంలో ఉద్యోగంలో చేరతారని వార్షిక వేతనం రూ 6 లక్షలు వరకు ఉంటుందని తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సాదినేని రామారావు, ప్లేస్మెంట్ అధికారి జె.రవి శంకర్, విభాగాధిపతులు రాధికా, సితార, నవీన్ లు విద్యార్థులను అభినందించారు.

## పట్టించుకోపోతే వాహనాలను ఆపుతాం

**ప్రజాశక్తి- తాడేపల్లి**

రాజధానికి దగ్గరగా ఉన్న తాడేపల్లి నులకపేట మీదగా, ఉండవల్లి తదితర ప్రాంతాల నుండి పెద్ద ఎత్తున ఇసుక, మట్టి, కంకరు తదితర బిల్డింగ్ మెటీరియల్ తీసుకొని భారీ లారీలుగా తిరుగుతున్నాయని నులకపేట వాసులు అసంతృప్తి వ్యక్తం చేశారు. వాహనాలను నిలిపేస్తామని రోడ్డు ఎక్కారు. భారీ వాహనాలు ఇరుకైన ఈ రోడ్డు గుండా తిరగటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయభ్రాంతులకు గురవుతున్నామని స్థానికులు ఆపోతున్నారు. గతంలో అనేకసార్లు తాము అధికారులకు, అధికార పార్టీ నాయకులకు విన్నవించిన స్పందించడం లేదన్నారు. విషయం తెలుసుకున్న టిడిపి పట్నం అధ్యక్షులు వల్లభనేని వెంకటరావు ఆ ప్రాంతానికి చేరుకొని ప్రజలు చెప్పేది విన్నారు. భారీ వాహనాలు ఈ రోడ్డు కూడా తిరగకుండా తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో స్థానికులు శాంతించారు.

## పాపాయిపాలెంలో ఎమ్మెల్యే ప్రవీణ్ పర్యటన

**ప్రజాశక్తి - బెల్లంకొండ**

తన 100 రోజుల పర్యటనలో భాగంగా మండలంలోని పాపాయిపాలెంలో ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభకు ప్రజల నుండి వినతులు వెల్లువెత్తాయి. వాటిని పరిశీలించిన ఎమ్మెల్యే పరిష్కారం కోసం అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు వెంకటరామిరెడ్డి, నందిరేసిపాలెం సొసైటీ చైర్మన్ ఓర్చు ఆనంద్, మండల బీసీ సెల్ అధ్యక్షులు గంగారావు, రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి మస్తాన్ షరీఫ్, మండల కోర్ కమిటీ సభ్యులు వెన్న సీతామరామిరెడ్డి, నంది రాజుపాలెం హుస్సేన్, మాజీ సర్పంచ్ గుడిసె కొండయ్య, నల్ల మేక లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

# అధిక ధరలకు చికెన్ విక్రయాలు

ప్రజాశక్తి - తుళ్లూరు

రాజధాని ప్రాంతం తుళ్లూరులో అధిక ధరలకు చికెన్ అమ్మకాలు జరుగుతున్నాయి.జిల్లాలో చాలా ప్రాంతాల్లో కెజి స్కిన్ లెస్ చికెన్ ధర రూ 220లు,స్కిన్ తో రూ.200లకు అమ్మకాలు జరుగుతుండగా తుళ్లూరులో కెజి స్కిన్ లెస్ చికెన్ రూ.260లు, స్కిన్ తో రూ.240గా ఉంది. రాజధానిలో అద్దెలు ఎక్కువగా ఉన్నాయని, మిగతా ప్రాంతాల్లో మాదిరిగా అమ్మకాలు జరిపితే గిట్టుబాటు కాదంటూ వినియోగదారుల వద్ద నుంచి డబ్బులు దోచుకుంటున్నారన్నారు. మాంసం విక్రయ దారులందరూ కూడబలుక్కొని ఇష్టమొచ్చి నట్లుగా ధరలు పెంచుతున్నా అడిగే నాథుడు లేదని కొనుగోలు దారులు వాపోతున్నారు. రాజధాని ప్రాంతం కావడంతో పలు రాష్ట్రాల నుంచి వచ్చిన కార్మికులు, ఉద్యోగులు చికెన్ కొనుగోలుకు ఆసక్తి చూపుతుండడంతో అమ్మకాలు పెరిగినప్పటికీ అధిక ధరలను తగ్గించడం లేదని మండి పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి చికెన్ ధరలను నియంత్రించాలని కోరుతున్నారు.

**ఫుడ్ సేఫ్టీ అధికారులు ఎక్కడ..?**

రాజధాని నేపథ్యంలో తుళ్లూరు పరిసర గ్రామాల్లో వ్యాపార సంస్కృతి నానాటికీ విస్తరిస్తోంది. రాజధాని నిర్మాణ పనులకు వివిధ రాష్ట్రాల నుంచి కార్మికులు, ఉద్యోగులు రావడంతో వ్యాపార దుకాణాలు పెద్ద ఎత్తున ఏర్పాటయ్యాయి. హెూటళ్లు, బిర్యానీ, కర్రీ పాయింట్లు, చిప్స్ అమ్మే షాపులు, కూరగాయలు, పండ్ల దుకాణాలు ప్రధాన రహదారి పక్కన పెద్ద సంఖ్యలో ఉన్నాయి. రహదారి పక్కన ఉండడంతో ఆహార పదార్థాలపై దుమ్మూధూళీ పడుతున్నా కొంతమంది హెూటళ్ల నిర్వాహకులు ఎలాంటి జాగ్రత్తలూ తీసుకోవడం లేదు. ఆహార నాణ్యత, పరిశుభ్రతతో పాటు నిబంధనలు పాటిస్తున్నారా.. లేదా.. అధిక ధరలు తదితర అంశాలపై ఆహార భద్రతా విభాగం అధికారులు తరచూ తనిఖీలు చెయ్యాల్చి ఉండగా ఆవిధంగా జరగడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.

దీక్షల్లో పాల్గొన్న కార్మికులు

## 367వ రోజుకు చేరిన కార్మికుల దీక్షలు

ప్రజాశక్తి-తాడేపల్లి

తమకు న్యాయంగా రావాల్సిన నష్టపరిహారం కోసం ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న దీక్షలు శుక్రవారం నాటికి 367వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలను సీఐటీయూ కార్యదర్శి వేముల దుర్గారావు, యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్, షేక్ సుభాని, తుపాకుల నాగేశ్వరావు, దుర్గాభవాని ప్రారంభించారు. దీక్షల్లో వై.రమాదేవి, ఈ శారమ్మ, ఎ.శివకుమారి, షేక్ ఈమాంబి, డి.నాగమల్లేశ్వరి కూర్చున్నారు. కార్యక్రమంలో ఆశీర్వాదం, బి.అంకయ్య, గురవయ్య, యహోషువా, హగ్గయ్య, డి.నాగేశ్వరావు, పిచ్చయ్య, రిబ్కా, శారదా, సువర్ణ పాల్గొన్నారు.

విద్యార్థులతో అధ్యాపకులు

## స్కౌట్స్ యూనిఫామ్ అందజేత

ప్రజాశక్తి- తాడేపల్లి

స్థానిక జిల్లా పరిషత్ హై స్కూలులో కొత్తగా భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ గ్రూపును ఇటీవల ప్రారంభించారు. పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్‌గా పనిచేస్తున్న రజిని నాయక్ మాస్టారు గ్రూపులోని 36 మంది విద్యార్థులకు శుక్రవారం స్కౌట్ యూనిఫామ్ ఉచితంగా అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు భీమిరెడ్డి తాతి రెడ్డి మాట్లాడుతూ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తాడేపల్లి విద్యార్థిని విద్యార్థులకు, అత్యున్నత విద్యా ప్రమాణాలతో విద్యను అందజేయడం కాకుండా, ఆటపాటలలలో, క్రమశిక్షణలో అత్యుత్తమ శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. పాఠశాల యందు ఎన్ సి సి మరియు స్కౌట్ గ్రూపులు ఏర్పాటు,ప్రభుత్వ గుర్తింపుతో ఈ సంవత్సరమే పాఠశాల యందు ప్రారంభించడం ఆనందదాయకమని తెలిపారు. ఎన్ సి సి మరియు స్కౌట్ నందు ప్రభుత్వము శిక్షణ ఇచ్చి, పరీక్షలు నిర్వహించి, సర్టిఫికెట్లు ఇస్తారని భవిష్యత్తులో విద్యార్థిని విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు మెరుగు బడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# రహదారి భద్రత, డిఫెన్సివ్ డ్రైవింగ్‌పై శిక్షణ

ప్రజాశక్తి - తుళ్లూరు

అమరావతి ఇంటిగ్రేటెడ్ అర్బన్ డెవలప్ మెంట్ ప్రోగ్రాం (ఎఐయుడిపి) అమలు కార్యకలాపాలలో భాగంగా రహదారి భద్రతపై అవగాహన కల్పించేందుకు రాయపూడి సిఆర్‌డిఎ ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో ప్రోగ్రాం మేనేజ్‌మెంట్ కన్సల్టెన్సీ, ప్రాజెక్టు మేనేజ్‌మెంట్ కన్సల్టెన్సీ, సిఆర్‌డిఎ, ఎడిసిఎల్, కాంట్రాక్టర్స్ సిబ్బందికి 'రహదారి భద్రత, డిఫెన్సివ్ డ్రైవింగ్ పై శుక్రవారం శిక్షణ ఇచ్చారు. రాజధానిలో జరుగుతున్న నిర్మాణ ప్రాజెక్టులలో రోడ్డు ప్రమాదాలను జీరోకు తగ్గించడం, ప్రమాదాలకు గురయ్యే వారి రక్షణ ప్రధాన లక్ష్యంగా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. డిఫెన్సివ్ డ్రైవింగ్ పద్ధతులు, భవనాలు, భారీ భవన సముదాయాల నిర్మాణ దశలో పాటించాల్సిన రోడ్డు భద్రతా చర్యలు, ప్రమాదాల నివారణకు పాటించాల్సిన విధానాలపై సమగ్రంగా అవగాహన కల్పించారు. ఈ శిక్షణ ఎంతో ప్రయోజనకరంగా ఉందని, తరచుగా నిర్వహించాలని శిక్షణలో పాల్గొన్న వారు కోరారు. 2026 జనవరిలో జరగనున్న 'రోడ్డు భద్రత మాసం' కార్యక్రమాన్ని అమరావతి రాజధాని అభివృద్ధి ప్రాజెక్టులో అమలవుతున్న ఈ విధానం (ఇంజనీరింగ్, ఎన్‌ఫోర్స్‌మెంట్,ఎడ్యుకేషన్, ఎమర్జెన్సీ విభాగాలు), అందులోని భాగస్వాములను, సంబంధిత ప్రభుత్వ శాఖల అధికారులతో కలసి నిర్వహించడానికి సిఆర్‌డి ఎ,పిజిఎంసి, పిఎంసి సిబ్బంది సంసిద్ధత వ్యక్తం చేశారు. కార్యక్రమాన్ని పిజిఎంసి రోడ్డు భద్రత నిపుణులు అరుణ్‌కుమార్ గాజుల, పిఎంసి రోడ్డు భద్రత నిపుణులు ఎగ్గా కిరణ్ కుమార్ నిర్వహించగా, సిఆర్‌డిఎ తరపున కార్మిక కమిషనర్ అనితా వాణి భూపతి,గుడివాడ గోపీకృష్ణ,బోయ శ్రీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సబ్సిడీ విడుదల చేయాలని రెండవ రోజుకు చేరిన దీక్ష

**ప్రజాశక్తి - మంగళగిరి :** ఆంధ్రప్రదేశ్ ఎస్సీ, ఎస్ టి పారిశ్రామికవేత్తలకు కూటమి ప్రభుత్వం సబ్సిడీ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం మంగళగిరి పట్టణంలో గల ఏపీఐఐసీ భవనం వద్ద కోనసీమ జిల్లా అమలాపురం చెందిన కె.శ్రీనివాసరావు కుటుంబ సభ్యులు దీక్ష కార్యక్రమాన్ని చేపట్టారు. వారితోపాటు శుక్రవారం మరి కొంతమంది పారిశ్రామికవేత్తలు దీక్షలో పాల్గన్నారు. ఈ సందర్భంగా గత నాలుగు సంవత్సరాలుగా 42 లక్షల రూపాయలు సబ్సిడీ విడుదల చేయాల్సి ఉందని ఇంతవరకు విడుదల చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనేక సార్లు ఇక్కడకు వచ్చి వినతి పత్రాలు అందజేసినప్పటికీ అధికారులు పట్టించుకోవడంలేదని వాపోయారు.రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, రాష్ట్ర మంత్రి నారా లోకేష్ పట్టించుకుని సబ్సిడీ చెల్లించాలని కోరారు. అదేవిధంగా రాష్ట్ర వ్యాప్తంగా ఎస్సీ, ఎస్ టి పారిశ్రామికవేత్తలకు సబ్సిడీలు 500 కోట్ల రూపాయలు రావాల్సి ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో రాజశేఖర్, దయాకర్ పాల్గొన్నారు.


### ప్రకటన

నా క్లయంట్ అయిన రావూరి నాగమణి భర్త: (లేటు) రావూరి హరిబాబు, ఫ్లాట్ నెం #301, కృష్ణం రెసిడెన్సీ, జెకెసి కాలేజ్ రోడ్, గుంటూరు తేది: 03.12.2025న ఆమె తనకు సంబధించి దస్తావేజులు అనగా దఖలు దస్తావేజు నెం. 375/1984 (ఒరిజినల్), SRO కాకుమాను, దస్తావేజును కవరులో పెట్టుకొని జిరాక్స్ నిమిత్తం బైక్ మీద వెళ్తున్నప్పుడు 4వ లైన్, బ్రాడీపేట, గుంటూరు సమీపంలో జారిపడి పోయినది. వెంటనే అక్కడ ఆ దగ్గరలో మరియు చుట్టుపక్కల అంత వెతికినను కనిపించలేదు చుట్టు ప్రక్కల విచారించినను ఫలితములేదు. కావున ఎవరికైన దొరికిన యెడల దయచేసి ఈ దస్తావేజును ఈ చిరునామాకి అప్పగించగలరు.

**చిరునామా:**
**కాసు వెంకట రెడ్డి (అడ్వకేట్)**
**డోర్ నెం:6-14-13,**
**14/3 అరండల్ పేట్, గుంటూరు.**
**సెల్ నెం:8341356178.**

### బహిరంగ ప్రకటన

నా క్లయింట్సు కరుటూరి వెంకటేష్, C/o. కరుటూరి వెంకట రత్నం(సెల్:9885713451) నివాసం:డోర్.నెం.49-4/2-7-బి-209, SLV అమరావతి గ్రాండ్ ఇన్నర్ రింగురోడ్డు, మార్గము దగ్గర,గుణదల, విజయవాడ అర్బన్, మాచవరం, కృష్ణాజిల్లా మరియు బూరుగుపల్లి రంజిత్ కుమార్, S/o.విక్రమార్కుడు (సెల్:9701187777), నివాసం డోరు నెం.4-22/2 మొఘల్ సెంటర్, ఉండ్రాజవరం(మం), వినాయకుడి గుడిదగ్గర, వెలివెన్ను, ఈస్ట్ గోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్ వారి నుండి సంజాయిషీ పొంది యావన్మందికి తెలియజేయునది. నాక్లయింట్స్ ఈ దిగువ షెడ్యూలు దాఖలా భూమిని శ్రీ పొదిలి సాంబశివరావు S/o.(లేటు) వెంకటసుబ్బయ్య, (లేటు) రామలక్ష్మీగార్ల నివాసం డోర్.నెం. 3-53, పెదమద్దూరు(గ్రామం), అమరావతి (మం), పల్నాడుజిల్లా, అమరావతి స.రి. పార్టీషన్ దస్తావేజు నెం.5513/2024రు తాలూకు భూమిని వారి నుండి కొనుగోలు చేయుటకు నిర్ణయించిరి. కావున ఈ షెడ్యూలు భూమికి సంబంధించి ఏవిధమైన, చట్టపరమైన, కోర్టు సంబంధమైన వివాదాలు, అభ్యంతరాలు వున్న ఈ ప్రకటన తేది నాటి నుండి 10రోజులలో తెలియజేయగలరు. ఆ తరువాత వచ్చే అభ్యం తరాలు ఏవైననూ నాక్లయింట్స్‌నుగాని, షెడ్యూలు ఆస్తిని గాని బైండుచేయలేవు.

**షెడ్యూలు:** పల్నాడు జిల్లా, నరసరావుపేట రి.డి॥ అమరావతి సబ్.డి॥ యిలాకా అమరావతి(మం), పెదమద్దూరు గ్రామ పంచాయితీ ఏరియాలో చేరిన పెదమద్దూరు గ్రామ డి.నెం.101 దాఖలా శ్రీ పొదిలి సాంబశివరావు గారి వాటాకు రాబడిన య.1-00శెంట్లు స్థిరాస్తి శేరి మెరకభూమికి **హద్దులు. తూర్పు:** పొదిలి శ్రీనివాసరావు వగైరాల భూమిహద్దు, **దక్షిణం:** వాగు హద్దు, **పడమర:** పొదిలి శ్రీనివాసరావు వగైరాల భూమిహద్దు, **ఉత్తరం:** పొదిలి శ్రీనివాసరావు భూమిహద్దు.

**నీలగిరి కోటయ్య,** M.A., B.Ed.,LL.B.,
న్యాయవాది, అమరావతి, పల్నాడుజిల్లా, సెల్: 9963014598

### మహారాజ శ్రీ బాపట్ల ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో.

**I.P.No. 20/2025.**

1) Koduri Sukumari
W/o HanumanthaRao R/o
B.K.Palem,Kakumanu Mandalam.
2) Borra Srikanth,S/o Sivaiah,R/o
B.K.Palem, Kakumanu Mandalam.
........Petitioners.
And
1)Vamsi Enterprises, represented by it's Authorized Signatory, Nagarampalem, Guntur.
2)Maheswara Agro Chemicals Prattipadu, rep by it'sAuthorized Signatory, Bapathu Brahmmananda Reddy.
3) Babu Fertilizers, Main Road, Ponnur rep. by Proprietor Shaik Gafur.
4) Sri Padmavathi Enterprises, Eturuku Road, Guntur Represented by it's Proprietor MallipeddiSeshamunendra.
5) Sreshta Life Sciences, Guntur rep. by Proprietor/Authorized Signatory.
6) Krishna Sai Enterprises, Patnam Bazaar, Guntur represented By its authorized Signatory.
7)Sri Srinivasa Agri Farm, Sangadigunta Guntur represented By its Proprietor/Authorized Signatory.
8) Success Enterprises, Sangadigunta, Guntur. Rep.by Proprietor /Authorized Signatory.
9) Vaibhav Marketing Corporation, Majeti Godowns, Guntur Represented by it's Managing Partner.
10) Surya Chandra Seeds & Pesticides Patnam Bazaar Guntur rep. by Proprietor Vajrala ChendrasekharReddy
11) MVR Agro Agencies, Suryadevarapeta, Etukuru road, Guntur rep. by it'sProprietor MadanaNagireddy.
12) Sri Lakshmi Narasimha Enterprises Chaparalavari Street Guntur rep. by it's Authorized Signatory.
13) Sri Ramnjaneya Fertilizers & Pesticides, Patnam Bazaar, Guntur rep by it's Authorized signatory
....... Respondents.

పైనెంబరు I.P.No:20/2025న పిటిషనర్లు బాపట్ల సీనియర్ సివిల్‌జడ్జివారి కోర్టులో Insolvents (దివాళా కోర్లుగా)డిక్లైయర్ చేయమని సదరు పిటీషన్‌ను దాఖలు చేసుకొని యున్నారు. శ్రీ కోర్టు వారు జనరల్ నోటీసు పబ్లిష్ చేయమని ఆర్డర్ వేసినారు. కావున పైన చూయించిన రెస్పాండెంట్స్ కాకుండా ఇంకా ఎవరికైనా ఈపిటిషనర్లు బాకీ ఉండిన యెడల మీరు ది: 30- 12-2025వ తేదీన బాపట్ల ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో మీరు స్వయంగా గాని లేదా మీ తరపు లాయరు గారి ద్వారా గాని హాజరై ఏమైనా ఆక్షేపణలు ఉన్నాయెడల తెలుపుకొనగలరు. లేనియెడల మీ పరోక్షమున తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియపరచ డమైనది.

// శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //
**వాయిదా తేదీ : 30-12-2025.**

ఇట్లు
**రామినేని వెంకటేశ్వర్లు B.Com.BL,**
**అడ్వకేట్, బాపట్ల.**

### CHANGE OF NAME

I **Munagala Leka Vardhan** (Old Name) S/o Munagala Ramesh, D.No. 11- 880, RAT Nala Cheruvu, Managalagiri Tadepalli Municipal Corpotation, Guntur District, A.P - 522502. Do Here By Publish inform that I Have Changed My Name As **MUNAGALA LIKITH VARDHAN** (NEW NAME) S/o Munagala Ramesh, D.No. 11- 880, Ratnala Cheruvu, Managalagiri Tadepalli Municipal Corpotation, Guntur District, A.P - 522502.

### SUIT NOTICE
**IN THE COURT OF THE PRL. JUNIOR CIVIL (JUNIOR DIVISION) TEALI**
**O.S 852025**

Between :
Chendu Swarajya Lakshmi ... Plaintiff
vs
Pilli Sesh Babu ... Defendant
To,
Pilli Seshu Babu, So Narasimha Ro,
R/o D.No. 4-7-16, Marrispet, Tenali.

పై నెంబరు దావాలోమీకు అనేక పర్యాయములు కోర్టు ద్వాంంను పోస్టల్ ద్వారాను నోటీసులు ఎన్ని పంపించిననూ తీసుకొనక కాలయాపన చేయుచున్న కారణమున శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం పేపరు ప్రచురణ ద్వారా మీ నోటీసు నిమిత్తం ది. 10-12-2025వ తేదీకి పై కోర్టులో వాయిదా వున్నది. సదరుతేదీ ఉదయం 10-30 గం.లకు మీరు గానీ, మీ తరఫు ప్లీడరుగారు గానీ పై కోర్టులో హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేనిచో మీ పరోక్షమున దావా తీర్మానించబడునని యిందుమూలం గా తెలియజేయటమైనది.

వాయిదాతేదీ: 10-12-2025
తెనాలి.

O/o పేట పిచ్చయ్య
షేక్ ఫిరోజ్ బాషా
పేట ప్రత్యూష
వాది తరపు అడ్వకేట్స్,
తెనాలి. సెల్ నెం. **95502 43253**

### మహారాజశ్రీ 3వ అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టు, విజయవాడ

**I.A. NO. 244/2020 in I.A. No. 194/2020 in O.S. No. 334/2019**

Between:
**యలమంచలి బాల యుగంధర్ శివరామ తిరుమాల్, తరుపున పవర్ ఆఫ్ ఎటార్నీ** - వాది
**ఉన్నం సురేంద్రనాథ్**

మరియు

**యార్లగడ్డ రంగనాయకమ్మ మరియు ఇతరులు**
- ప్రతివాదులు

**R-3: మచ్చా నాగేంద్రమ్మ,** భర్త (లేటు) వెంకటప్పయ్య, నివాసం కాస్లాల అగ్రహారం గ్రామం, అచ్చంపేట మం., గుంటూరు జిల్లా.

**R-5: మచ్చా రమ్య,** తండ్రి: లేటు మచ్చా సాంబశివరావు, నివాసం డోర్ నెం. 4-85, కనుమూరు గ్రామం, పామర్రు మం., కృష్ణాజిల్లా.

పై నెంబరు దావాలోని పిటీషన్ నెం. 194/2020లో 3 మరియు 5వ రెస్పాండెంట్స్‌గా మిమ్మల్ని చేర్చుటకు గానూ మీ యొక్క అభ్యంతరములకుగానూ **సదరు పిటీషన్‌ను ది. 09-12-2025వ తేదీనకు వాయిదా వేసి యున్నారు.** కావున మీకు గల అభ్యంతరములను తెలుపుటకుగానూ మీ ఇరువురూ పై తెలిపిన కోర్టు వారి ఎదుట వ్యక్తిగతంగా గానీ లేక న్యాయవాది ద్వారా గానీ **ది. 09-12-2025వ తేదిన ఉ॥ గం॥ 10-30 ని॥లకు హాజరు కావలసినదిగా ఈ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది.** లేని యెడల సదరు పిటీషన్ మీకు పరోక్షంగా తీర్మానించబడును.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వులతో)
**వాయిదా తేది 09-12-2025**

ఇట్లు
**చోడిశెట్టి సురేష్ కుమార్,**
**చోడిశెట్టి శివనాగ కుమారి** న్యాయవాదులు
మొగల్‌రాజపురం, విజయవాడ-10. ✆ 98668 41292

### IN THE COURT OF THE HON'BLE CHAIRMAN, MOTOR ACCIDENTS CLAIMS TRIBUNAL-CUM- PRL. DISTRICT JUDGE RANGA REDDY DISTRICT, AT: L.B.NAGAR

**M.V.O.P No. 380 Of 2025.**

Between:
Rykanti Sujatha, and Others
...Petitioner's
AND
Sakinam.Malleshwar Rao and Other
...Respondent's
To
R-1, Sakinam.Malleshwar Rao, S/o. S.Yedukondalu Age: 48 years,Occ: Driver-Cum-Owner. R/o. H.No. 7-20-279, 12 th Lane Sarada Colony. Amaravathi Road Guntur, Andhra Pradesh-522002.

The Petitioner herein had filed the above petition for compensations under section 166 of the M.V. Act, 1988 and Rule 475/1B of A.P.M.V. Rule 1989 R/W Section 140 of M.V.Act, 1989, against the Respondent which includes you .The Hon,ble Court directed for Publication of this notice for your appearance in the above M.VO.P and the matter is posted to 17.12.2025 at 10:30 am and therefore you may appear before this Hon'ble Court either personally or through your Advocate, otherwise the matter will be ad judicated in due process of law. Hence, this Notice.

[BY OREDER OF THE HONBLE COURT]

**M/s.MAHESHKUMAR**
**CHUKKALA YALALA KISHOR**
ADVOCATE'S
Office:- 3-11-473/1, 1 st Floor, Shiva Mahindra Nilayam, Shiva Ganga Colony,L.B.Nagar, Ranga Reddy District-500074 , T.S

# పరిమితుల్లేకుండా ధాన్యం మొత్తాన్నీ కొనాలి

ప్రజాశక్తి-ఈపూరు

రైతు వద్ద ఉన్న ప్రతి ధాన్యం గింజను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని రైతుసంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి ఏపూరి గోపాలరావు డిమాండ్ చేశారు. మండల కేంద్రమైన ఈపూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో వినియోగంలో లేని ధాన్యం ఆరబోసే యంత్రాన్ని (డ్రైయర్) నాయకులు శుక్రవారం పరిశీలించారు. అనంతరం విలేకర్లతో గోపాలరావు మాట్లాడుతూ వ్యవసాయ మార్కెట్ యార్డులో రూ.లక్షలు వెచ్చించి కొనుగోలు చేసిన డ్రైయ్యర్ దశాబ్ధం కాలంగా మూలన పడిందని, మరమ్మత్తులు చేయించి వినియోగంలోకి తేవాలని కోరారు. జిల్లాలో ధాన్యం దిగుబడి ప్రభుత్వ కొనుగోలు లక్ష్యాల కంటే ఎక్కువగా ఉందని ఆంక్షలు విధించకుండా ధాన్యం మొత్తాన్ని మద్దతు ధరకు కొనాలన్నారు. మొంథా తుపాను ప్రభావంతో పంట దిగుబడి తగ్గి, రంగు మారడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని, వారిని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. రైతులకు టార్పాలిన్ పట్టాలు, తైవాన్ స్ప్రేయర్లు, ఆధునిక వ్యవసాయ యంత్ర పరికరాలను 90 శాతం రాయితీతో అందజేయాలన్నారు. స్వామినాథన్ సిఫార్సు ప్రకారం క్వింటాళ్ రూ.2,900కు కొనాల్సి ఉండగా కేంద్ర ప్రభుత్వం 'ఎ' గ్రేడ్ రకానికి రూ.2320, సాధారణ రకానికి రూ.2300 ప్రకటించిందని, గతేడాది కంటే రూ.20 మాత్రమే పెంచిందని చెప్పారు. పెరిగిన వ్యవసాయ పెట్టుబడులతో ఈ ధరలు చాలడం లేదని అన్నారు. చత్తీస్‌ఘడ్, కేరళతోపాటు మరికొన్ని రాష్ట్రాల్లో బోనస్ ఇచ్చి ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారని, ఇక్కడా బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. బ్యాంకుల ద్వారా పంట రుణాలు ఇప్పించాలని, ఉచిత పంటల బీమా అమలు చేయాలని కోరారు. పల్నాడు ప్రజల దశాబ్ధాల కలైన వరికపుడిసెల ప్రాజెక్టును సత్వరం చేపట్టాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కె.హనుమంతరెడ్డి, ఎం.దేవసహాయం పాల్గొన్నారు.

మార్కెట్ యార్డులో వినియోగంలో లేని ధాన్యం ఆరబోసే యంత్రం వద్ద రైతు సంఘం నాయకులు

## గణపవరం పిహెచ్‌సి వైద్యులు, సిబ్బందిపై సస్పెన్షన్ వేటు

ప్రజాశక్తి - నాదెండ్ల

విధుల్లో నిర్లక్ష్యం వహించారని మండలంలోని గణపవరం పిహెచ్‌సిలోని ఇద్దరు వైద్యాధికారులు, 10 మంది సిబ్బందిపై సస్పెన్షన్ వేటు వేస్తూ పల్నాడు జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయం నుంచి శుక్రవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ప్రాథమిక ఆరోగ్య కేంద్ర తనిఖీకి రాష్ట్ర వైద్యారోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండియన్ బుధవారం రాగ ఆరోగ్య కేంద్రానికి తాళాలు వేసి ఉన్నాయి. డ్యూటీలో ఉండాల్సిన ఒక డాక్టర్ సాయంత్రం 4 గంటలకు వెళ్లిపోతారు. మరో డాక్టర్ ఇతర సిబ్బందికి డ్యూటీ చార్ట్ చేసి వెళ్లాల్సి ఉన్నా ఆలా చేయకపోవడంతో సిబ్బంది కూడా వెళ్లిపోయారు. ఆ సమయంలో తనిఖీకి వచ్చినా కమిషనర్ దీన్ని గమనించి చర్యలకు ఆదేశించారు. డాక్టర్ ప్రసాద్ నాయక్, కవిత అనసూయతో పాటు సిబ్బందిని సస్పెండ్ చేసినట్లు పల్నాడు జిల్లా వైద్యాధికారి రవి తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వీరి స్థానంలో వివిధ ప్రాంతాల నుంచి డాక్టర్లను సిబ్బందిని డిప్యూటేషన్‌పై నియమించారు.

## సిడిపిఒ కార్యాలయంలో అంగన్వాడీల వినతి - 12న ధర్నా

ప్రజాశక్తి - నాదెండ్ల

కనీస వేతనం రూ.26 వేల అమలుతోపాటు ఇతర సమస్యల పరిష్కారం కోసం స్థానిక సిడిపిఒ కార్యాలయంలో అధికారి నాగబాబుకు అంగన్వాడీలు శుక్రవారం వినతిపత్రం ఇచ్చారు. పెండింగ్‌లో ఉన్న 1810 మినీ వర్కర్లకు క్వాలిఫికేషన్ రిలాక్సేషన్ ఇచ్చి మెయిన్ సెంటర్లుగా మార్చాలని, హెల్పర్ల ప్రమోషన్లకు విధివిధానాలు రూపొందించాలని కోరారు. అంగన్వాడీలకూ సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని, యాప్‌లన్నింటినీ కలిపి ఒకే యాప్‌గా మార్చాలని, సెంటర్ నిర్వాహణకు 5జి ఫోన్లు ఇవ్వాలని, ఎఫ్ఆర్ఎస్‌ను రద్దు చేయాలని కోరారు. 164 సూపర్వైజర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. ప్రీస్కూల్ను బలోపేతం చేయడంతోపాటు అందులోని విద్యార్థులకు తల్లికి వందన పథకాన్ని వర్తింపజేయాలన్నారు. ఈ సమస్యలపై 12న రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్‌ల వద్ద ఆందోళన చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ చిలకలూరిపేట అధ్యక్షులు జి.సావిత్రి, సిఐటియు కార్యదర్శి పి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను తిప్పికొట్టే వరకూ పోరాటం

- 4న విశాఖలో భారీ ప్రదర్శన, బహిరంగ సభకు తరలిరండి
- సిఐటియు అఖిల భారత మహాసభ పోస్టర్ల ఆవిష్కరణలో కె.ఉమామహేశ్వరరావు పిలుపు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం 4 లేబర్ కోడ్‌లుగా మార్చిందని, కార్మికుల హక్కుల హననకు, వారి శ్రమదోపిడీకే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూనుకున్నాయని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు అన్నారు. ఈ విధానాలను తిప్పికొట్టేందుకు సిఐటియు పోరాడుతుందని అన్నారు. నరసరావుపేటలోమున్సిపల్ కార్మికులతో శుక్రవారం నిర్వహించిన సమావేశానికి ఫెడరేషన్ జిల్లా ఉపాధ్యాయులు జీవరత్నం అధ్యక్షత వహించారు. ఈనెల 31 నుండి వచ్చే నెల 4 వరకు విశాఖపట్నంలో జరగనున్న సిఐటియు అఖిలభారత మహాసభ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించిన అనంతరం ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ టిడిపి కూటమి అధికారంలోకి వచ్చి ఏడాదిన్నరైనా మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించలేదన్నారు. 48 వేల మందికి పైగా మున్సిపల్ కార్మికులు వేతనాలు పెరగక అవస్థలు పడుతున్నా పట్టించుకోవడం లేదని, ఉద్యోగులకు ఇచ్చే ప్రయోజనాలేమీ మున్సిపల్ కార్మికులకు అమలు కావడం లేదని చెప్పారు. 60 ఏళ్లకే రిటైర్మెంట్ చేస్తున్నా బెనిఫిట్స్ ఇవ్వటం లేదని విమర్శించారు. కారుణ్య నియామకాలు చేపట్టకుండా దొడ్డిదారిన అధికార పార్టీ నాయకులు తమ అనునయుల వద్ద లంచాలు తీసుకొని ఉద్యోగాలు ఇస్తున్నారని అన్నారు. సిఐటియు పల్నాడు జిల్లా ఉపాధ్యక్షులు గుంటూరు విజయకుమార్ మాట్లాడుతూ కార్మికుల సమస్యలు పరిష్కరించక పోగా 13 గంటల పాటు పని విధానాన్ని అమలుకు పూనుకోవడం దారుణమన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్లకు కట్టబెడుతున్నారని, ఉద్యోగులకు ఉద్యోగ భద్రత లేకుండా చేస్తున్నారని విమర్శించారు. వీటిన్నింటిపై చర్చించి పోరాటా కార్యాచరణ రూపకల్పన కోసం జరిగే సిఐటియు జాతీయ మహాసభను అన్ని రంగాల కార్మికులు, ఉద్యోగులు, జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఫెడరేషన్ పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సిలార్‌మసూద్, నాయకులు మల్లయ్య, ఏసు, విజయలక్ష్మి, సామ్రాజ్యం, జాన్, నరసింహారావు, రమణ, సోమశేఖర్ పాల్గొన్నారు.

నరసరావుపేటలో కార్మికులతో సమావేశం

పిడుగురాళ్లలో పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-పిడుగురాళ్ల, సత్తెనపల్లి

పట్టణంలోని బంగ్లా సెంటర్ వద్ద మున్సిపల్ కార్మికుల సమావేశం నిర్వహించారు. కె.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు గుదిబండగా మారిన వర్క్ ఔట్సోర్సింగ్ విధానాన్ని వెనుక తీసుకోవాలని, ఏళతరబడి పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. 8 గంటల పని విధానాన్ని కొనసాగించాలని, 12 గంటల పని విధానాన్ని రద్దు చేయాలని, పండగ సెలవులు, క్యాజువల్ లీవులు అమలు చేయాలని, చనిపోయిన వారి స్థానంలో వారి కుటుంబీకులకు అవకాశం కల్పించాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని కోరారు. ఈ సందర్భంగా సిఐటియు జాతీయ మహాసభ కరపత్రాన్ని ఆవిష్కరించారు. 4న విశాఖలో జరిగే ర్యాలీ, బహిరంగ సభకు కార్మికులు తరలిరావాలన్నారు. దీంతోపాటు స్థానిక మార్కెట్ యార్డ్ వద్ద సివిల్ సప్లయిస్ గోడౌన్‌వద్ద ముఠా కార్మికులతో సమావేశమయ్యారు. కార్మికులకు పెరిగిన ధరలకు అనుగుణంగా కూలి రేట్లు పెంచాలన్నారు. కూలిరేట్ల ఒప్పందం ముగుస్తున్న నేపథ్యంలో కూలి రేట్లు పెంపుదలకు ప్రభుత్వం చొరవచూపాలన్నారు. హమాలీ వర్కర్స్ కు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి, వారికి ప్రమాద బీమా, పని భద్రత కల్పించాలని, కార్మికులు చెల్లించాల్సిన కూలి రేట్లు బిల్లును సకాలంలో చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశాల్లో షేక్ శిలార్ మసూద్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ మండల గౌరవాధ్యక్షులు టి.శ్రీనివాసరావు, కార్మికులు బి.రామారావు, మార్తమ్మ, సుజాత, బి.అనిల్‌కుమార్, కె.సాగర్‌బాబు, పరమేశ్వరరావు, జి.నాగేశ్వరరావు, కె.గురవయ్య, డి.చిన్న వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. సత్తెనపల్లిలోని పుతుంబాక భవన్ ఆవరణలో పోస్టర్లను ఆవిష్కరించగా ఉమామహేశ్వరరావు మట్లాడారు. సిలార్ మసూద్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు వి.చంద్రకళ, సిఐటియు పట్టణ కన్వీనర్ జె.రాజ్‌కుమార్, కార్మికులు పాల్గొన్నారు.

## మృతులకు ఎస్ఎఫ్ఐ నివాళి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నాదెండ్ల మండలం గణపవరం వద్ద గురువారం రాత్రి జరిగిన ఘోరం రోడ్డు ప్రమాదంలో ఐదుగురు విద్యార్థుల మృఇపై భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) పల్నాడు జిల్లా కమిటీ విచారం వ్యక్తం చేసింది. ఈ మేరకు జిల్లా నాయకులు కె.రోహిత్ పిడుగురాళ్లకు చెందిన విద్యార్థి మహేష్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతుల కుటుంబాలను ప్రభుత్వం అన్నివిధాలుగా ఆదుకోవాలని కోరారు.

## అద్దె బకాయిలున్న రెండు షాపులు సీజ్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా : నరసరావుపేట పట్టణం స్టేషన్‌రోడ్డులోని ఎస్‌సి షాపింగ్ కాంప్లెక్స్‌ను గుంటూరు ఎస్‌సి కార్పొరేషన్ ఏఇఓలు కె.రాజేంద్రకుమార్, వై.లోకాస్ శుక్రవారం తనిఖీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన జీఓ 26 ప్రకారం ప్రతి పట్టణంలో తనిఖీలు చేస్తున్నామన్నారు. నవంబర్ నుండి డిసెంబర్ వరకు తనిఖీలు జరుగుతాయని తెలిపారు. అద్దె బకాయి ఉన్న 17, 19 నంబర్ల షాపులను సీజ్ చేసినట్లు తెలిపారు. మొత్తం నరసరావుపేటలో మొత్తం 64 షాపులు ఉన్నాయని, ప్రతి షాపును తనిఖీ చేశామని, బాకీలున్న షాపుల నిర్వాహకులంతా అద్దె చెల్లించేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. చనిపోయిన వారి పేరు మీద ఉన్న షాపులను తనిఖీ చేశామని, బినామీలు ఖాళీ చేయాలని స్పష్టం చేశారు.

## శ్రీ బాలాజీ ఐటిఐలో క్రీడా పోటీలు

ప్రజాశక్తి - వినుకొండ : శ్రీ బాలాజీ ఐటిఐ కళాశాలలో సంకురాత్రి కృష్ణయ్య - గంగమ్మ జ్ఞాపకార్థం సంకురాత్రి ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో 19వ స్పోర్ట్స్ మీట్‌ను శుంక్రవారం నిర్వహించారు. క్రికెట్, వాలీబాల్, రన్నింగ్, వక్తృత్వం, వ్యాసరచన, కబడ్డీ, షటిల్, షాట్‌పుట్‌లో విజేతలకు బహుమతులను ముఖ్యఅతిథులుగా హాజరైన ఆలిండియా రేడియో ఉద్యోగి రవిబాబు, సంకురాత్రి ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ ఎస్.కోటేశ్వరరావు ప్రదానం చేశారు. గత విద్యా సంవత్సరానికి ఉత్తమ విద్యార్థులుగా ఎంపికైన పరసా విజయ్, గుంజరి ప్రవీణ్, దూపాటి జేమ్స్ డేనియల్‌కు ఒక్కొక్కరికి రూ.1116 చొప్పున నగదు ప్రోత్సాహకాలు అందించారు. గత విద్యాసంవత్సరం పదో తరగతిలో 597, 595, 591, 589 మార్కులు సాధించిన విద్యార్థులను సన్మానించారు. అనంతరం వృద్ధులకు దుస్తులు పంపిణీ చేశారు. కాలేజీ కరెస్పాండెంట్ సంకురాత్రి జానకి, కళాశాల ప్రిన్సిపాల్ కర్రి వెంకట్, సంకురాత్రి ఎడ్యుకేషనల్ సొసైటీ సభ్యులు సైదులు, అంకారావు, రాము పాల్గొన్నారు.

## విద్యార్థుల పట్ల బాధ్యతగా ఉండాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - బెల్లంకొండ

మండలంలోని పాపాయపాలెం జెడ్‌పి పాఠశాలలో జరిగిన మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశానికి ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ హాజరయ్యారు. విద్యార్థుల పట్ల బాధ్యతాయుతంగా ఉండాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను అందిపుచ్చుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని విద్యార్థులకు చెప్పారు. ఎంపిడిఒ సునీత, ఎంఇఒ బాలసుందర్రావు పాల్గొన్నారు.

# అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలివ్వాలి

**ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను మంత్రి నారా లోకేష్ అమలు చేయాలి**

**సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వై.నేతాజీ**

**ప్రజాశక్తి మంగళగిరి**

మంగళగిరి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఇళ్ల స్థలం లేని నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ప్రభుత్వం ఇవ్వాలని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వై నేతాజీ అన్నారు. శుక్రవారం మంగళగిరి సిపిఎం కార్యాలయంలో ఎంపీఎంసీ పరిధిలో విస్తృత సమావేశం జరిగింది. ఈ సిపిఎం మంగళగిరి పట్టణ కార్యదర్శి వివి జవహర్లాల్ అధ్యక్షతన సమావేశంలో నేతాజీ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ మంత్రి నారా లోకేష్ ఎన్నికలకు ముందు వివిధ రకాల భూముల్లో ఇళ్లు వేసుకొని నివాసం ఉంటున్న వారందరికీ ఇళ్ల పట్టాలు ఇస్తామని ఎన్నికలకు ముందు వాగ్దానం చేశారన్నారు. ఆ వాగ్దానం మేరకు ఇప్పటివరకు కేవలం 3000 మందికి మాత్రమే ఇళ్ల పట్టాలు ఇవ్వడం జరిగిందని అన్నారు. ఇంకా నియోజకవర్గంలో 17,000 మంది వివిధ రకాల భూముల్లో ఇల్లు వేసుకొని నివాసముంటున్న పేదలకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వాళ్లందరికీ పట్టాలు ఇచ్చే ప్రక్రియను ఇంకా మొదలు పట్టలేదని, అధికారంలోకి వచ్చి సంవత్సరం ఆరు నెలలు గడిచిందని చెప్పారు. ఇంకా ప్రక్రియ ప్రారంభించక పోతే ఎప్పుడు ఇస్తారని ప్రశ్నించారు. నియోజకవర్గంలో 20,000 మంది పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చి, ఇళ్లు కట్టించి ఇస్తానని వాగ్దానం చేశారని, ఆ వాగ్దానం మేరకు పక్రియ కూడా ఇంతవరకు ప్రారంభించలేదని అన్నారు. ప్రారంభించకపోగా పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వడానికి స్థలాలు ఎక్కడున్నాయని అధికార పార్టీ నాయకులు ప్రశ్నించడం సబబు కాదని అన్నారు. ప్రభుత్వం పరిశీలిస్తే ఎం.టి.ఎం.సి పరిధిలో కనపడతాయని అన్నారు. సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పాశం రామారావు మాట్లాడుతూ రాజీవ్ గృహకల్ప గృహ సముదాయం మరమ్మతులు చేయడానికి నిధులు కేటాయిస్తానని ఇంతవరకు కేటాయించలేదని అన్నారు. టిడ్కోగృహాలలో ఉన్న ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని అన్నారు. సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో దోమల బెడదతో అక్కడున్న నివాసితులు అనారోగ్యానికి గురవుతున్నారని అన్నారు. తాగునీరు కూడా సక్రమంగా అందడం లేదని అన్నారు. ఇళ్ల స్థలాలు, ఇళ్ల పట్టాలు ఇచ్చేంతవరకు సిపిఎం ఆధ్వర్యంలో పోరాటాన్ని ఉధృతం చేస్తామని అన్నారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఈమని అప్పారావు, ఎం రవి, బి వెంకటేశ్వర్లు, సిపిఎం సీనియర్ నాయకులు జొన్న శివశంకరరావు, జెవి రాఘవులు, డి వెంకట్ రెడ్డి, పి బాలకృష్ణ, సిపిఎం జిల్లా నాయకులు ఎస్ ఎస్ చెంగయ్య, డి శ్రీనివాస్ కుమారి, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వై.నేతాజీ

వినతిపత్రం ఇస్తున్న నాయకులు

అర్జీల స్వీకరణలో ఆలపాటి రాజేంద్రప్రసాద్

## నాలుగు రైతుసేవా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు : జెసి

**ప్రజాశక్తి - చేబ్రోలు**

ధాన్యం కొనుగోలు కేంద్రాలను చేబ్రోలు మండలంలో శుక్రవారం గుంటూరు జిల్లా జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిర్దేశించిన కనీస మద్దతు ధరకే ధాన్యాన్ని విక్రయించాలని సూచించారు. మద్దతు ధర 100 కేజీలు సాధారణ రకం రూ.2369లు, గ్రేడ్ ఏ రకం రూ.2389 గా ప్రభుత్వ నిర్దేశించిందని తెలిపారు. చేబ్రోలు మండలంలో అన్ని రైతు సేవ కేంద్రంలో గోనె సంచులు, టార్పాలిన్ పట్టాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. రైతులు ధాన్యాన్ని17 శాతం తేమ, లేక నిమ్ము శాతం ఉండాలని పేర్కొన్నారు. రైతులు తమ కళ్లాలలో నుంచి ధాన్యాన్ని వ్యర్థ పదార్థాలు, మట్టి రాళ్లు, చెత్త శుభ్రం చేసుకోవాలని వివరించారు. మండలంలోని చేబ్రోలు, నారా కోడూరు, శేకూరు, వడ్లమూడి ఈ నాలుగు రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో మండల రెవెన్యూ అధికారి కె శ్రీనివాస్ శర్మ, జిల్లా సివిల్ సప్లై అధికారి పద్మావతి, ఇన్చార్జి మండల వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లు, తెలుగుదేశం పార్టీ నాయకుడు మైలా వెంకట రామ రాజు , వ్యవసాయ శాఖ సిబ్బంది జి మోహన్, జాన్, మార్కొడే నుంచి రాజు, రవితేజ, మరియు ధాన్యం కొనుగోలు సిబ్బంది చేబ్రోలు మండలం పార్టీ నాయకులు రైతులు పాల్గొన్నారు.

## విఆర్ఎలకు పే స్కేల్ అమలు చేయాలి

**ప్రజాశక్తి-గుంటూరు**

గ్రామ రెవెన్యూ సహాయకుల సమస్యలు పరిష్కారం చేయాలని విఆర్ఎల సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు బి.లక్ష్మణరావు కోరారు. ఈ మేరకు జిల్లా రెవెన్యూ అధికారికి ఎన్ఎస్కె.ఖాజావలికి అసోసియేషన్ నాయకులు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 17నెలలు గడుస్తున్నా వీఆర్ఏల సమస్య ఏఒక్కటి పరిష్కారం కాలేదన్నారు. వీఆర్ఏలకు గత 8 సంవత్సరాలుగా జీతాలు పెరగలేదన్నారు. రాష్ట్రంలో మంత్రులు, ముఖ్యమంత్రులు మారుతున్నా విఆర్ఎల సమస్యలు మాత్రం పరిష్కారం కావట్లేదన్నారు. వీఆర్ఏలతో అక్రమ డ్యూటీలు చేయిస్తున్నారని, జీతం బెత్తడు, బండ చాకిరి చేయిస్తున్నారని, వీఆర్ఏలు శ్రమ దోపిడికి గురవుతున్నారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో వీఆర్ఏలకు పేస్కేలు అమలు చేసి ప్రభుత్వం ఆదుకుంటుందని, ఇక్కడ కూడా అమలు చేయాలని కోరారు. అర్హత ఉన్న వీఆర్ఏలను విఆర్ఓగా పదోన్నతి కల్పించాలని, ప్రమోషన్ల విషయంలో ప్రభుత్వం జాప్యం చేస్తుందన్నారు. దళిత, గిరిజన, బడుగు బలహీన వర్గాలకు చెందిన వీఆర్ఏలను ఆకలి బాధల నుండి ప్రభుత్వం ఆదుకోవాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా వీఆర్ఏలకు పే స్కేలు అమలు చేయాలన్నారు. అటెండర్, నైట్వాచ్మెన్ ప్రమోషన్ శాతాన్ని 70కు పెంచాలన్నారు. అక్రమ డ్యూటీలను రద్దు చేయాలన్నారు.ఎన్నికల హామీల మేరకు కనీస వేతనం అమలు చేయాలని, వీఆర్ఏలను నైట్ వాచ్మెన్ డ్యూటీలు, అటెండర్ డ్యూటీలు, డ్రైవింగ్ డ్యూటీలు నుండి మినహాయించాలని, ఖాళీగా ఉన్న రికార్డ్ అసిస్టెంట్, అటెండర్, నైట్ వాచ్మెన్ పోస్టులను వీఆర్ఏలతో భర్తీ చేయాలని కోరారు.వినతిపత్రం ఇచ్చిన వారిలో జిల్లా కోశాధికారి పంతగాని జైపాల్, నాయకులు బొక్క సాంబశివరావు, నామతోటి రామారావు, కారుసాల ప్రభుదాసు, సుభాని, పేరయ్య, వెంకటరత్నం పాల్గొన్నారు.

## సమస్యలపై అర్జీలు స్వీకరించిన ఎమ్మెల్సీ

**ప్రజాశక్తి - తెనాలి**

ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం ప్రజా సమస్యలపై అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా రంగంలో పారదర్శకత కోసం పేరెంట్ టీచర్ సమావేశం నిర్వహణకు ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసిందన్నారు. ఆ మేరకు సమర్థవంతంగా రాష్ట్రవ్యాప్తంగా పేరెంట్ టీచర్ సమావేశాలు జరిగాయని చెప్పారు. అదేవిధంగా ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు ప్రతివారం అర్జీలు స్వీకరిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ శాఖలకు సంబంధించి వచ్చిన అర్జీలను ఆయా అధికారులకు పంపి పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. అర్హులు ఎవరూ నష్టపోకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో మహమ్మద్ ఖుద్దూస్, జె మహేష్ పాల్గొన్నారు.

## ట్రాఫిక్‌కు అడ్డంకిగా వ్యాపారాలు తగదు : సిఐ

**ప్రజాశక్తి - తెనాలి**

వాహనాల రాకపోకలకు అడ్డంకులు సృష్టిస్తూ రోడ్డుపై వ్యాపారాలు నిర్వహించడం సరికాదని పట్టణ టూ టౌన్ సిఐ రాముల నాయక్ వ్యాపారులను హెచ్చరించారు. స్టేషన్ పరిధిలో షాపులను మించి రోడ్డును ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్న వారిని పోలీస్ బృందం గుర్తించింది. వారితో సిఐ మాట్లాడారు. పట్టణంలో నిత్యం ట్రాఫిక్ సమస్యలు ఉంటున్నాయని, ఆ సమస్యలను అధిగమించాలంటే వ్యాపారులు తమ పరిధిలోనే వ్యాపారాలు కొనసాగించాలని, వాహనాల రాకపోకలకు అడ్డంకి సృష్టించకూడదని చెప్పారు. షాపుల బోర్డులను రోడ్డుపై ఏర్పాటు చేయడం, షాపుకు సంబంధించిన సామాగ్రి రోడ్లపై ఉంచడం, చేతివృత్తుల వారు వారికి సంబంధించిన పరికరాలను, మెటీరియల్‌ను రోడ్ల వెంట ఉంచటం సరికాదని, వాటిని స్వచ్ఛందంగా తొలగించాలని కోరారు. ఆయన వెంట ఎస్సైలు, సిబ్బంది ఉన్నారు.

## సిఐటియు జాతీయ మహాసభను జయప్రదం చేయండి

**ప్రజాశక్తి - దుగ్గిరాల**

డిసెంబర్ 31 నుండి జనవరి 4వరకు విశాఖపట్నంలో నిర్వహిస్తున్న సిఐటియు జాతీయ మహాసభను జయప్రదం చేయాలనిసిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఈమని అప్పారావు కోరారు. శుక్రవారం మహాసభ జయప్రదం కోసం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వరి కోతలు జరుగుతున్నాయని ధాన్యాన్ని రైతు సేవ కేంద్రాల ద్వారా మద్దతు ధరకు కొనుగోలు చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని చెప్పారు. రైతు సేవ కేంద్రాల ద్వారా కొనుగోలు చేయకపోవడం మూలంగా ప్రైవేటు వ్యక్తులు తక్కువ ధరలకు 1300 నుంచి కొంటున్నారని, ఆ విధంగా రైతులు నష్టపోతున్నారని ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు కొనుగోలు చేయాలని కోరారు కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కార్యదర్శి జెట్టి బాలరాజు వై స్టాలిన్ యోగేశ్వరరావు, వై బ్రహ్మేశ్వర రావు పాల్గొన్నారు. **ప్రజాశక్తి - మంగళగిరి రూరల్** :సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కార్మికుల రక్షణ కొరకు అనేక పోరాటాల ద్వారా సాధించుకున్న 29 కార్మిక చట్టాలను అమలు చేయాలని లేబర్ కోడ్స్ రద్దు చేయాలని డైలీవేజ్ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని బిల్డింగ్ సంక్షేమ బోర్డులు పునరుద్ధరించాలని తదితర డిమాండ్లతో విశాఖపట్నంలో జరిగే సిఐటియు అఖిలభారత 18వ మహాసభను జయప్రదం చేయాలని నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమలో సిఐటియు మంగళగిరి కార్యదర్శి వుద్దంటి దుర్గారావు ప్రజాసంఘాల నాయకులు ఈమని అప్పారావు బి కోటేశ్వరి గద్దం అజయ్ కుమార్ కాజా శంకర్రావు సింహాద్రి సుమ సత్యమారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాజలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

## వర్సిటీ పరీక్షా ఫలితాలు విడుదల

**ప్రజాశక్తి - ఎఎన్‌యు**

ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో గత ఆగస్టు నెలలో జరిగిన ఇన్ఫార్మసీ మొదటి సెమిస్టర్ సప్లమెంటరీ, రెండో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షల ఫలితాలను విడుదల చేసినట్లు పరీక్ష నిర్వహణ అధికారి ఆలపాటి శివప్రసాద్ శుక్రవారం తెలిపారు. ఫలితాలను వర్సిటీ వెబ్‌సైట్ నుండి పొందవచ్చునన్నారు. రీకౌం టింగ్ కొరకు ఈనెల 15వ తేదీలోపు ఒక్కొక్కపేపర్ కు రూ.2190లు చొప్పున చెల్లించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. అదేవిధంగా బిఎ ఎల్ ఎల్ బి హానర్స్ 5 సంవత్సరాల మొదటి సెమిస్టర్ రీవాల్యుయేషన్ ఫలితాలను కూడా విడుదల చేసినట్లు చెప్పారు.

## తల్లిదండ్రులు,ఉపాధ్యాయుల సమన్వయం కీలకం

**ఎమ్మెల్యే గళ్లా మాధవి**

**ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి**

విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమన్వయం కీలకమని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గం ఏటి అగ్రహారం ఎస్‌కెబిఎంఎంసి పాఠశాలలో డిపార్ట్మెంట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా పేరెంట్స్ సమావేశానికి మాధవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పాఠశాలలోని ఎన్.సీసీ క్యాడెట్ల నుండి గౌరవ వందనం స్వీకరించారు. ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మధ్య సమన్వయాన్ని పెంచి విద్యార్థుల విద్యా పురోగతిని సక్రమంగా పర్యవేక్షించేందుకు ప్రభుత్వం ఇప్పటి వరకు మూడు సార్లు ఈ సమావేశాలను నిర్వహిస్తుందన్నారు. విద్యార్థుల్లో ప్రశ్నించే తత్వం, సివిక్ సెన్స్ పెంచేందుకు మంత్రి నారా లోకేష్ వినూత్న కార్యక్రమాలను అమలు చేస్తున్నారని తెలిపారు. ఇటీవల నిర్వహించిన మాక్ అసెంబ్లీ విజయవంతం అయిందన్నారు. టిడిపి నాయకులు అడకా పద్మావతి, తుమ్మల నాగేశ్వరరావు, అడక శ్రీను, గొర్ల మల్లేశ్వరి, దాసరి వెంకటేశ్వరావు,ఖాజా వలి, పఠాన్ అస్మా తదితరులు పాల్గొన్నారు.

## పిల్లల ప్రవర్తనను తల్లిదండ్రులు గమనించాలి

**ప్రజాశక్తి-గుంటూరు**

తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశాల ద్వారా విద్యారంగంలో నూతన ఒరవడికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం భారత్‌పేటలోని మున్సిపల్ హైస్కూల్లో జరిగిన మెగా పేరెంట్స్ టీచర్స్ ఆత్మీయ సమావేశంలో కమిషనర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఈ సమావేశాల ద్వారా తల్లిదండ్రులు తమ పిల్లలకు చదివే పాఠశాల వాతావరణం, పిల్లల ప్రగతిని నేరుగా పరిశీలన చేయడానికి వీలు కలుగుతుందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల కోసం ప్రత్యేకంగా సమయం కేటాయించుకోవాలని, వారి ప్రవర్తన, మిత్రులు, ఆలోచన విధానంను క్షుణ్ణంగా పరిశీలిస్తూ ఉండాలన్నారు. విద్యార్థులు కూడా తమ తల్లిదండ్రులు తమ మీద పెట్టుకున్న ఆశలను వమ్ము చేయకుండా కష్టపడి చదువుకోవాలని, ప్రస్తుతం ఉన్నత స్థానాల్లో ఉన్న ప్రతి ఒక్కరూ చిన్ననాటి నుండి క్రమపద్ధతిలో చదువుకొన్న వారేనన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వి.నాగ మంజరి, పేరెంట్స్ కమిటి చైర్మన్ ఎం.దుర్గా భవాని పాల్గొన్నారు.

చీకటీగలపాలెం ఏపీ మోడల్ స్కూల్‌లో విద్యార్థులతో మాట్లాతున్న చీఫ్‌విప్ జీవీ, దుర్గిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జూలకంటి, నరసరావుపేటలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే చదలవాడ

# దేశంలోనే ఉత్తమ విద్యావిధానం ఏపీలో రూపుదిద్దుకుంటోంది

**ప్రజాశక్తి - వినుకొండ**

దేశంలోనే ఉత్తమ విద్యావ్యవస్థగా ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో రూపుదిద్దుకుంటోందని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. వినుకొండ మండలం అందుగుల కొత్తపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్, చీకటీగలపాలెం ఏపీ మోడల్ స్కూల్‌లో శుక్రవారస్త్రం 'పేరెంట్స్ టీచర్స్' సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న చీఫ్‌విప్ జీవీ మాట్లాడుతూ విద్యా వ్యవస్థను మంత్రి లోకేష్ తిరిగి గాడిన పెడుతున్నారన్నారు. 10వ తరగతి ఫలితాల్లో విద్యార్థులకు రాష్ట్రస్థాయి టాపర్‌కు రూ.3 లక్షలు, జిల్లాస్థాయిలో రూ. 2లక్షలు, నియోజకవర్గ స్థాయిలో రూ.లక్ష అందిస్తామన్నారు. రాష్టం మొత్తం 590 మార్కులు దాటిన విద్యార్థులందరికీ మంత్రి లోకేష్ రూ. 20 వేలు ప్రోత్సాహం ఇవ్వడం చాలా మంచి విషయమన్నారు. ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు, అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాశక్తి - దుర్గి**

కూటమి ప్రభుత్వంలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సారధ్యంలో ప్రభుత్వ విద్య బలోపేతానికి రాజీలేని సంక్షేమం అమలౌతుందని మాచర్ల శాసన సభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని దుర్గి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రులు, టీచర్ల ఆత్మీయ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విద్యార్థులు ఏర్పాటు చేసిన వివిధ రకాల స్టాల్స్, మెడికల్ క్యాంపును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**ప్రజాశక్తి - మాచర్ల రూరల్**

తల్లిదండ్రులు ఉపాధ్యాయులు ఒకే వేదికపై కలుసుకొని విద్యా నాణ్యత, పురోగతి, భవిష్యత్తు లక్ష్యాలు సంస్కరణపై చర్చించేందుకు "మెగా"పేరెంట్స్ మీటింగ్ ఎంతగానో ఉపయోగపడుతుందని మాచర్ల మున్సిపల్ చైర్మన్ షేక్ మదర్ సాహెబ్ తెలిపారు. శుక్రవారం పట్టణం లోని వాణి విద్యానికేతన్ హైస్కూల్‌లో మెగా పేరెంట్స్ డేను నిర్వహించారు. మదార్ మాట్లాడుతూ పచ్చని చెట్ల మధ్య ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉన్న వాణి విద్యానికేతర పాఠశాల యాజమాన్యం విద్యాభివృద్ధికి చేస్తున్న కృషి అమోఘం అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆటలు పోటీలు నిర్వహించి బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ కె.వి.రమణ, డైరెక్టర్ కె.ఆంజనేయ దేవి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

**ప్రజాశక్తి - వినుకొండ**

శావల్యాపురం శ్రీరామ పబ్లిక్ స్కూల్లో విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయుల సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ కె.వి.ఆర్.మోహన్‌చంద్ మాట్లాడుతూ విద్యార్థులు పాఠ్య పుస్తకాల అంశాలకే పరిమితం కాకుండా వివిధ రంగాల్లో నైపుణ్యాలను నేర్చుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.రత్నకుమారి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**ప్రజాశక్తి-పల్నాడు జిల్లా**

బడి పిలుపు - వికసిత్ ఆంధ్రకు మలుపు అనే నినాదంతో రాష్ట్ర ప్రభుత్వ మెగా పేరెంట్-టీచర్ మీటింగ్ కార్యక్రమాన్ని శుక్రవారం నరసరావుపేట నియోజకవర్గంలో నిర్వహించారు. పాఠశాలల్లో నిర్వహించిన పిటీఎం 3.0 కార్యక్రమాలు ఒక పండగ లాగా నిర్వహించారు. ప్రకాష్ నగర్‌లోని తిలక్ మెమోరియల్ హైస్కూల్, క్రిస్టియన్ పాలెంలోని అంబేద్కర్ మున్సిపల్ హైస్కూల్, నరసరావుపేట మున్సిపల్ బాయ్స్ హైస్కూల్, మున్సిపల్ గర్ల్స్ హైస్కూల్, శంకర్ భారతిపురంలోని జడ్పీ హైస్కూల్ లలో జరిగిన ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. విద్యార్థులతో కలిసి సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాలకు తల్లిదండ్రులు హాజరై, పాఠశాల అభివృద్ధి, విద్యార్థుల ప్రతిభ, ఇంగ్లీష్ మీడియం అమలు, డిజిటల్ తరగతులు, టాయిలెట్ల నిర్మాణం వంటి అంశాలపై ఎమ్మెల్యేతో చర్చించారు.

**ప్రజాశక్తి - యడ్లపాడు**

మండలంలోని లింగారావుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పేరెంట్ - టీచర్ సమావేశంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాఠశాలకు వచ్చి తమ పిల్లల విద్యా సంబంధమైన అభివృద్ధిని ఉపాధ్యాయులతో చర్చించారు. ప్రముఖ మనోవైజ్ఞాన శాస్త్రా నిపుణులు టి.సుగంధరావు మోటివేషన్ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.వి.రామిరెడ్డి, ఎస్ఎంసి కమిటీ చైర్మన్ షేక్ జాన్ సైదులు, గ్రామ సర్పంచ్ షేక్ కరిముల్ మహబూబ్ సుభాని, తోకల సత్యనారాయణ గ్రామ పెద్దలు కట్టా శ్రీహరి, నంబూరు తులసయ్య, గోగడ హరిబాబు, మురుకుట్ల శ్రీధర్ కుమార్, నంబూరు శివ రామకృష్ణ, సాధినేని సుధీర్, ఉపాధ్యాయులు వి.శ్రీనివాస రావు, సి.రవీంద్రనాథ్‌రెడ్డి, టి.విజయ సామ్యూల్, కె.రమాదేవి, షేక్ ఇమామ్ పాల్గొన్నారు.

**ప్రజాశక్తి - యడ్లపాడు**

స్థానిక సెయింట్ ఆన్స్ సైన్స్ అండ్ ఆర్ట్స్ కాలేజీలో మెగా పేరెంట్స్ మీట్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అనేకమంది విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. విద్యార్థినిల ప్రోగ్రెస్‌ని కాలేజీ అధ్యాపకులు వివరించాచు. ప్రిన్సిపాల్ ప్రీతి సిస్టర్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు షేక్ అబ్దుల్ జబ్బార్, సునీల్ సార్ సాగర్, షేక్ సైదు, దీపిక, ఆమని, జ్ఞానమేరి సిస్టర్, స్టార్ సిస్టర్ తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాశక్తి - విజయపురిసౌత్**

విద్యార్థులకు ఉత్తమ విద్య అందించడమే ధ్యేయమని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం డి.జ్యోతి అన్నారు. శుక్రవారం పాఠశాలలో మెగా పేరెంట్స్ - టీచర్స్ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు బొల్లా వెంకటేశ్వర్లు చౌదరి, ఎస్ఎంసి చైర్మన్ రామ్‌చంద్ నాయక్, ఆడెపు కోటయ్య,మత్యకారులు సంఘం అధ్యక్షుడు మైలపల్లి అప్పలరాజు,బబ్బిలి చంద్రశేఖర్, హరనాథ్ బాబా, కట్టారాజు, గంటా ధనుంజయ రావు, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు..

**ప్రజాశక్తి-ఈపూరు**

మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్, ఏపీ మోడల్ స్కూల్, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం పాఠశాలల్లో శుక్రవారం తల్లిదండ్రుల సమావేశాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందరరేగా విద్యార్థులు రూపొందించిన గణిత ప్రదర్శనలు అధికారులు సందర్శించారు. సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎంఎస్ఎంఈ అభివృద్ధి బోర్డ్ డైరెక్టర్ రాపర్ల జగ్గారావు, తహశీల్దార్ ఎ.నళిని, ఎంపీడీవో ఎ.ఉమాదేవి, ప్రిన్సిపాల్ పి.పద్మజ, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

**ప్రజాశక్తి - క్రోసూరు**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన మెగాపేటియం 3.0 క్రోసూరు మండలం లో పూర్తిగా విజయవంతమైందని క్రోసూరు మండల ఎంఈఓ 1 కృష్ణ, ఎంఈఓ 2 గణేష్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అత్యంత అహ్లాదకర వాతావరణంలో జరిగిన సమావేశంలో విద్యార్థుల తల్లిదండ్రులు స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ సభ్యులు స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. పదవ తరగతి విద్యార్థులకు సంబంధించిన వందరోజుల యాక్షన్ ప్లాన్ గురించి ప్రత్యేకంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పెరుమాళ్లపల్లి కోటయ్య, జడ్పిటిసి జమీల బేగం, ఎంపీడీవో రవికుమార్, క్రోసూరు కాంప్లెక్స్ సిఆర్‌పి షేక్ అబ్దుల్‌సత్తార్, నాగమల్లేశ్వరి, సిహెచ్. రాంబాబు, షేక్ సుభాని, సిబ్బంది షేక్ జరీనా బేగం, పున్నారావు పాల్గొన్నారు.

**ప్రజాశక్తి - దాచేపల్లి**

రాష్ట్ర విద్యాశాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న మోగా టీచర్స్, పేరెంట్స్ సమావేశంలో భాగంగా మండలంలో వేడుకగా కొనసాగింది. అన్ని గ్రామాలలోని ప్రభుత్వ పాఠశాలల్లో సమావేశాలు నిర్వహించారు. ఈసందర్భంగా ఇరికేపల్లిలోని ఎంపిపిఎస్ పాఠశాలను ఎంఈఓ పినాకపాణి సందర్శించి విద్యార్దులకు ప్రతిరోజు అందించే మెనూను పరిశీలించి విద్యార్దుల తల్లిదండ్రులతో పాఠశాల బాగోగుల గురించి ముచ్చ టించారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పధకాన్ని విద్యార్దులతో కలసి చేసారు.ఈ కార్యాక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఎన్.యేషయ్య, ఎస్ఎంసి చైర్మన్ సిహెచ్ వెంకటేశ్వర్లు, గడ్డల వేదమణి, సీతారంరెడ్డి, అచ్చిరెడ్డి, పి.విజయ్‌కుమార్, టి.శ్రీనివాసరావు, పి.రవీంద్ర, బి.రాంబాబు, సైదాబి, ఏఎన్ఎం, అంగన్‌వాడీ టీచర్లు సుధారాణి, పద్మ, నాగేంద్రం, మాధురి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

**ప్రజాశక్తి - విజయపురిసౌత్**

ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదగాలని మత్యకారుల సంఘం మాజీ అధ్యక్షుడు ఎరిపల్లి వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం విజయపురిసౌత్ లోని సాగర్ క్యాంపు ప్రభుత్వ పాటశాలలో మెగా పేరెంట్స్ - టీచర్స్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రాజేశ్వరి, స్కూల్ కమిటీ చైర్మన్ బి.సత్తిబాబు, చిట్టిబాబు, నర్సింహులు, ఉపాధ్యాయురాలు రమ్య, తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాశక్తి - రెంటచింతల**

స్థానిక సెయింట్ సెయింట్ జోసెఫ్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాఠశాల కరస్పాండెంట్ ఫాదర్ గోవిందు బాలస్వామి హాజరయ్యారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు దుర్గాప్రసాద్, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు బంగారు కోటయ్యాచారి, తల్లిదండ్రుల కమిటీ అధ్యక్ష కార్యదర్శులు ఆడపు విజయ్, హుస్సేన్ బి , ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, శేషసాయి, ప్రవీణ్ కుమార్ ,రాంబాబు. ఫాతిమామరెడ్డి, పూర్వ విద్యార్థులు సుధాకర్ రెడ్డి, నవీన్ రెడ్డి, సుధీర్ రెడ్డి, సురేష్ పాల్గొన్నారు.

**ప్రజాశక్తి - పెదకూరపాడు**

మండల పరిధిలోని గారపాడు, పెద్దకూరపాడు, తాళ్లూరు జిల్లా పరిషత్ హైస్కూల్లో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం పాఠశాల ప్రధానోపాధ్యాయులు శివ నాగేశ్వరరావు, కాకాని వెంకటరమణ, శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన ఘనంగా జరిగింది. కార్యక్రమాల్లో మండల టిడిపి అధ్యక్షులు ఏటుకూరి బ్రహ్మయ్య, పెదకూరపాడు సర్పంచ్ గుడిపూడి రాజు, సీనియర్ నాయకులు బెల్లంకొండ రాంగోపాల్రావు, పెనుముచ్చు రామారావు, గల్లా బాబురావు, మక్కెన సాగర్, మద్దిరాల గంగాధర్, మద్దినేని వెంకట సత్యనారాయణ, షేక్ ముంతాజ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రాంతాల అభివృద్ధితోనే ప్రగతి : ఎమ్మెల్యే జూలకంట

**ప్రజాశక్తి - దుర్గి**

ప్రాంతాల అభివృద్ధితోనే ఆర్థిక ప్రగతిని సాధించవచ్చునని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి స్పష్టం చేశారు. దుర్గిలో రూ. 70 లక్షలు విలువ చేసే సీసీ రోడ్లు, సైడ్ డ్రెయిన్‌లకు ఎమ్మెల్యే జూలకంటి శుక్రవారం భూమిపూజ చేశారు. అనంతరం శిలాఫలకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమాన్ని రెండింటిని సమతాటిపై ముందుకు తీసుకుపోతూ ముఖ్యమంత్రి చంద్రబాబు పాటుపడుతున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

## కాపు కళ్యాణ మండప నిర్మాణానికి శంకుస్థాపన

**ప్రజాశక్తి - దాచేపల్లి**

పట్టణంలోని మాదినపాడు బైపాస్ రోడ్డు నందు 50లక్ష్యల రూపాయలతో కాపు కళ్యాణ మండపానికి గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు శుక్రవారం శంఖుస్థాపన చేశారు. కాసు కళ్యాణ మండపానికి 50లక్ష్యలు కేటాయించినందుకు కాసు నాయకులు యరపతిననికి ధన్యావాదాలు తెలిపారు. ఈ కార్యాక్రమంలో కూటమి నేతలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

చెక్కు అందజేస్తున్న టిడిపి నాయకులు

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

**ప్రజాశక్తి - విజయపురిసౌత్**

ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ గుంటూరులోని ఓ ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందిన విజయపురి సౌత్‌లోని గౌడ బజారుకు చెందిన వినుకొండ సిద్ధ శ్రీకి మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మరెడ్డి ఆదేశాలతో రూ. 53,778 సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును స్థానిక టీడీపీ అధ్యక్షుడు బొల్లా వెంకటేశ్వర్లు చౌదరి శుక్రవారం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో సీఎం చంద్రబాబు పేదలకు అండగా నిలుస్తున్నారని హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆడెపు కోటయ్య, మత్యకారుల సంఘం అధ్యక్షుడు మైలపల్లి అప్పులరాజు, రావుల శ్రీను, రామ్ చంద్, మస్తాన్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## గాయపడిన అంగన్‌వాడీ కార్యకర్త మృతి

**ప్రజాశక్తి-ఈపూరు**

రోడ్డు ప్రమాదంలో గాయపడిన అంగన్‌వాడీ కార్యకర్త రాపర్ల రాజ్యలక్ష్మి (57) శుక్రవారం మృతి చెందినట్లు సిడిపిఓ ఇ.వాణి తెలిపారు. మండలంలోని ఎర్రబాలెం గ్రామ అంగన్‌వాడీ కేంద్రం కార్యకర్త రాపర్ల రాజ్యలక్ష్మి గత నెల 24న గురజాల సమీపంలోని శుభకార్యానికి వెళ్లి ద్విచక్ర వాహనంపై తిరిగి వస్తుండగా మార్గ మధ్యలో మరొక ద్విచక్ర వాహనం ఢీకొనడంతో వెనుక కూర్చున్న రాజ్యలక్ష్మి కింద పడటంతో తలకు తీవ్ర గాయం అయింది. చికిత్స నిమిత్తం నరసరావుపేట తరలించి అక్కడి నుండి మెరుగైన చికిత్స కోసం గుంటూరు ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు.

## ఘనంగా ప్రపంచ నేల దినోత్సవం

**ప్రజాశక్తి - రెంటచింతల**

స్థానిక ఫాతిమా విద్యానికేతన్ ప్రపంచ నేల దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థినీ విద్యార్థులు రకరకాల మట్టివి సేకరించి వాటిలో కలిసి ఉన్న ఖనిజ లవణాలు, పోషకాలు గురించి చక్కగా వివరించారు. రాష్ట్రాలలో ఏ ఏ మట్టి రకాలు ఉన్నాయో వివరించి ఏ ఏ మట్టిలో ఏ ఏ రకాల పంటలు పండుతాయో, ఏ ఏ మట్టిలో ఏ ఏ రకాల మొక్కలు. పెరుగుతాయి అనే విషయాలను చక్కగా ప్రదర్శించి వివరించారు. ఈ కార్యక్రమనికి అధ్యక్షత వహించిన పాఠశాల డైరెక్టరు వై. ఫాతిమా మర్రెడ్డి మాట్లడుతూ విద్యార్థులలో ఉన్న స అజన్మకతను వెలికి తీయుటకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో తోడ్పడతాయని విద్యార్థిని, విద్యార్థులు ఇటు వంటి కార్యక్రమాలు చేయడానికి తాము ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయు రాలు శౌరి, స్టఫి స్టార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాల్గొన్న విద్యార్థినులు

## అభివృద్ధి వైపు రాష్ట్రం పరుగులు

**ప్రజాశక్తి-పల్నాడు జిల్లా**

రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యా, ఐటీ శాఖామంత్రి నారా లోకేష్‌ల ఆలోచనలతోరాష్ట్రం అభివృద్ధి వైపు పరుగులు పెడుతుందని టిడిపి పల్నాడు జిల్లా అధ్యక్షులు కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. విద్యావ్యవస్థను పటిష్ట పరుస్తూ తల్లిదండ్రులను పాఠశాల అభివృద్ధిలో భాగస్వామ్యం చేస్తుందన్నారు. పాఠశాలల అభివృద్ధికి విద్యార్థుల తల్లిదండ్రుల సూచనలు సలహాలతో విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు ప్రభుత్వం సహకారం అందిస్తుందన్నారు. కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు నిర్వహిస్తుందన్నారు.ఏపి విద్యా వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిపేందుకు మంత్రి లోకేష్ క అషి చేస్తున్నారన్నారన్నారు. విద్యా వ్యవస్థను ఆదాయ వనరుగా మార్చుకున్న ఘనత మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు.



మాట్లాడుతున్న మాజీ మున్సిపల్ కౌన్సిలర్ నరేంద్ర, వడ్డేశ్వరం జడ్‌పి హైస్కూల్‌లో నృత్య ప్రదర్శనలు ఇస్తున్న విద్యార్థులు, తెనాలిలో మాట్లాడుతున్న కమిషన్ రామ అప్పలనాయుడు

# గురువుల సూచనలే విద్యార్థులకు బంగారు భవిష్యత్

**ప్రజాశక్తి - మంగళగిరి**

ప్రతి విద్యార్థి గురువుల సూచనలు పాటించి నడుచుకుంటే వారికి బంగారు భవిష్యత్తు సొంతమవుతుందని మాజీ కౌన్సిలర్, టిడిపి నాయకుడు రంగిశెట్టి నరేంద్ర (బాబి) పేర్కొన్నారు. మంగళగిరి పట్టణ పరిధిలోని ఆర్ అండ్ బి బంగ్లా వద్ద ఉన్న మునిసిపల్ స్కూల్(బి.ఆర్) లో శుక్రవారం మెగా టీచర్స్ - పేరెంట్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నరేంద్ర మాట్లాడారు. మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టిడిపి గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు,కాపు కార్పొరేషన్ డైరెక్టర్ విన్నకోట శ్రీనివాసరావు, శివాలయం ట్రస్టు బోర్డు మెంబర్ సుఖమంచి గిరి, పాఠశాల కమిటీ వైస్ చైర్మన్ శేఖర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు, టౌన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ తాడిగిరి సుధీర్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు..

**వడ్డేశ్వరం జడ్పీ హైస్కూల్లో..**

**ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్**

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కార్యక్రమంలో భాగంగా ఎంటిఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం జిల్లా పరిషత్ హైస్కూల్లో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం (మెగా పిటిఎం) శుక్రవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు కాకుమాను జోజప్ప అధ్యక్షతన ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థిని విద్యార్థులతో వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు ఉపాధ్యాయులు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా రాష్ట్ర పాఠశాల అబ్జర్వర్ నాన్సీ హాజరయ్యారు. సిఎస్ఆర్ ఫండ్స్, నెస్లే కంపెనీ 10 లక్షల రూపాయలు బాలికల టాయిలెట్స్ కోసం ఉచితంగా నాలుగు యూనిట్లు కేటాయించారు. ఈ కార్యక్రమాన్ని తెలుగు మహిళా నాయకురాలు ఆరుద్ర భూలక్ష్మి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సిఎస్సి నితిన్ , ఆర్ఎస్ఎస్ శర్మ, ఉపాధ్యాయులు చావా శ్రీనివాసరావు, ఎం రవి, సత్యనారాయణ, శ్రీనివాసరావు, దాసరి శ్రీనివాసరావు, మహిళా ఉపాధ్యాయులు అనిలా సుల్తానా, సుబ్బలక్ష్మి, రమాదేవి, సునీత, విజయ్ కుమారి పాల్గొన్నారు.

**ప్రజాశక్తి - తెనాలి**

స్థానిక కొత్తపేట రావి సాంబయ్య మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాలలో మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ పండుగ వాతావరణంలో జరిగింది. ప్రధానోపాధ్యాయిని కె.భారతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ తాడిబోయిన రాధిక, కమిషనర్ జె.రామ అప్పలనాయుడు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. తొలుత విద్యార్థులతో పాటు సమావేశానికి హాజరైన తల్లిదండ్రులకు తరగతి గదులలో పిల్లల అభ్యాస స్థాయిలను ఉపాధ్యాయులు వివరించారు. ఛైర్‌పర్సన్, కమిషనర్ మాట్లాడారు. కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, తల్లిదండ్రులు, ఎస్ఎంసి సభ్యులు పాల్గొన్నారు.

**మున్సిపల్ ఉన్నత పాఠశాలలో..**

పట్టణంలో మున్సపల్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన మెగా పేరెంట్ టీచర్ సమావేశం జరిగింది. మున్సిపల్ చైర్ పర్సన్ తాడిపోయిన రాధిక ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తొలుత మారిసుపేట ఎన్ సి ఆర్ ఎం ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు పటాన్ కరిముల్లా అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న ఆమె విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో 21వ వార్డు కౌన్సిలర్ సయ్యద్ ఖలేదా నసీమ్, పాఠశాల ఉపాధ్యాయ బృందం విద్యార్థులు పాల్గొన్నారు.

**కొత్తపేట బాలికోన్నత పాఠశాలలో...**

కొత్తపేట డి ఇందిరా మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పేరెంట్ టీచర్ సమావేశంలో చైర్పర్సన్ ముఖ్యఅతిథిగా పాల్గన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్ ఆమె తిలకించారు. కార్యక్రమం లో వైస్ చైర్ పర్సన్ మాలేపాటి హరిప్రసాద్, మున్సిపల్ కమిషనర్ జె.రామ అప్పలనాయుడు, స్కూల్ ప్రధానోపాధ్యాయులు తోటకూర రాఘవయ్య, ఉపాధ్యాయులు విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

**ప్రజాశక్తి - కొల్లిపర**

మండలంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ప్రాథమిక పాఠశాలల్లో పేరెంట్స్, టీచర్స్ సమావేశాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీపీ భీమవరం పద్మావతి మాట్లాడుతూ విద్యార్థులు దేశానికి పట్టుకొమ్మలని అన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఆటపోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారిని ఝాన్సీలత, ఇన్‌చార్జి ఎంపీడీవో భార్గవ్, కొల్లిపర. తూములూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.సౌజన్య. నాగలక్ష్మి, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమావేశంలో విద్యార్థులు, అధ్యాపకులు, తల్లిదండ్రులు

**పెదనందిపాడు ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో..**

**ప్రజాశక్తి - పెదనందిపాడు**

స్థానిక పిఏఎస్ కళాశాలలో శుక్రవారం ఇంటర్మీడియట్ విద్యార్థుల పేరెంట్, టీచర్ మీటింగ్ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులు విద్యార్థినీ, విద్యార్థుల తల్లిదండ్రులతో పలు అంశాల గురించి చర్చించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన విద్యార్థుల తల్లిదండ్రులు గడచిన ఆరు దశాబ్దాల కాలంగా పి.ఎ.ఎస్ కళాశాల పాలకవర్గం ఈ ప్రాంత విద్యాభివృద్ధికి చేస్తున్న కృషిని కొనియాడారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.వీరరాఘవయ్య విద్యార్థులను ఉద్దేశించి పలు అంశాలను వారి తల్లిదండ్రులతో చర్చించినారు. వైస్ ప్రిన్సిపాల్ కే. ప్రతాప్ కుమార్, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ పాతూరి శ్రీనివాస్, టి గీతా లక్ష్మి, సి ఎల్ ఎస్ రెడ్డి, వి.శ్రీనివాసమూర్తి, కళాశాల పాలకవర్గ అధ్యక్షులు శ్రీకాళహస్తి సత్యనారాయణ, సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్ డాక్టర్ లావు రత్తయ్య, ట్రెజరర్ లావు ఆదిశేషయ్య జాయింట్ సెక్రటరీ నర్రా బాలకృష్ణ, వైస్ ప్రెసిడెంట్ మందడి చలపతిరావు, పాలకవర్గ సభ్యులు నర్రా వీరయ్య , సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం నాయకులు జవహర్‌లాల్

## నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేవరకు పోరాటం

**ప్రజాశక్తి మంగళగిరి**

మంగళగిరి పట్టణంలో ఇళ్ల స్థలం లేని నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేవరకు పోరాటం చేస్తామని సిపిఎం పట్టణ కార్యదర్శి వివి జవహర్లాల్ తెలిపారు. పాత మంగళగిరి కళ్యాణమండపంలో శుక్రవారం ఇళ్ల స్థలాల సాధన కొరకు సమావేశం జరిగింది. ఈ సమావేశానికి పాత మంగళగిరి సిపిఎం శాఖ కార్యదర్శి ఎం చలపతిరావు అధ్యక్ష వహించారు. జవహర్లాల్ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ అనేక సంవత్సరాలుగా పేదలు ఇళ్ల స్థలాలు లేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. మంగళగిరిలో చిన్న రేకుల షెడ్డు కూడా 5000 రూపాయలు అద్దె ఉందని అన్నారు. ఎన్నికల సందర్భంగా మంత్రి నారా లోకేష్ ఇళ్ల స్థలములేని నిరుపేదలందరికీ ఇళ్ల స్థలం ఇస్తానని వాగ్దానం చేయడం జరిగిందని అన్నారు. ఆ వాగ్దానం మేరకు ఇళ్ల స్థలాలు పేదలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఎం సీనియర్ నాయకులు పిల్లలమర్రి బాలకృష్ణ, సిపిఎం పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు వై కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రంథాలయాలను ఉపయోగించుకోవాలి : ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర

**ప్రజాశక్తి - చేబ్రోలు**

విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలని, గ్రంథాలయ పుస్తకాలు ఉపయోగించుకోవాలని ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ అన్నారు. శుక్రవారం మండల వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు ఉన్నత పాఠశాలల్లో, జూనియర్ కళాశాల డిగ్రీ కళాశాలలో మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశాలు ఘనంగా జరిగాయి. మండల పరిషత్ అభివృద్ధి అధికారులు రఘు, చలపతిరావు, రాయల సుబ్బారావు మాట్లాడారు. ప్రధానోపాధ్యాయులు ఎం.ఏడుకొండలు అధ్యక్షతన నారాకోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పేరెంట్స్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధూళ్లిపాళ్ల పీఎం శ్రీ పథకం కింద రూ. 23 లక్షలు మంజూరైన పాఠశాల నిర్వహణ కమిటీ ద్వారా నిర్మించిన నూతన లైబ్రరీ భవనాన్ని ప్రారంభించారు. విద్యార్థునుద్దేశించి మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తుకు ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేసి బంగారు బాటలు వేయాలన్నారు. జాతీయ స్థాయిలో క్రీడల్లో పాల్గొన్న ఫిరోజ్‌ను అభినందించారు.

పాఠశాల నూతన లైబ్రరీ భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే ధూళిపాళ్ల

ఢిల్లీలో జరిగిన సైన్స్ సెమినార్లో పాల్గొన్న అవినాష్, రవిశంకర్‌లను అభినందించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించారు. ఉత్తమ ప్రదర్శన చేసిన ఎన్ సి సి విద్యార్థులకు భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులకు బహుమతులు అందించారు . కార్యక్రమంలో సర్పంచి వెలగా సాంబశివరావు, మండల అభివృద్ధి అధికారి టి.ఊహరాణి, తహసీల్దార్ కె.శ్రీనివాస శర్మ , మండల విద్యాశాఖ అధికారులు, పాఠశాల ఎస్ఎంసి చైర్మన్ వెలగా గోపీనాథ్, జ్యోతి కుమార్, హరిబాబు, వెలగ పవన్ కుమార్, పూర్వ విద్యార్థులు, గ్రామ పెద్దలు అధికారులు, ఉపాధ్యాయులు. విద్యార్థులు పాల్గొన్నారు.

## పాఠశాలకు బీరువా వితరణ

**ప్రజాశక్తి - దుగ్గిరాల**

దుగ్గిరాలకు చెందిన స్వఛరేద సేవా సంస్థ దోస్త్ కోఆర్డినేటర్ గద్దె శ్రీనివాస్ మండలంలోని మంచికలపూడి గ్రామంలో ఉన్న ఎలిమెంటరీ పాఠశాలకు నూతన బీరువాను శుక్రవారం వితరణగా అందించారు. ట్యాబ్‌లు, ల్యాప్‌టాప్‌లు పాఠశాలకు చెందిన విలువైన వస్తువులు భద్రపరచుకోవటానికి బీరువాను అందించినట్లు

తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రాంబాబు, సర్పంచ్ దుర్గాభవాని స్థానికులు ఏమినే నీ కోటేశ్వరావు శంకర్ బాబు వై స్టాలిన్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంఈవో రమాదేవి

## పాఠశాల భవనం శిధిలం అయితే పిల్లలను బడికి ఎలా పంపించేది?

**ప్రజాశక్తి - ప్రత్తిపాడు**

పాఠశాల శిథిలంగా ఉంటే పిల్లలను బడికి ఎలా పంపించేది అని తల్లితండ్రులు ఎంఇఓ రమాదేవిని ప్రశ్నించారు. శుక్రవారం స్థానిక ఉర్దూ పాఠశాలో మెగా పేరెంట్స్ మీటింగ్ జరిగింది. ఎంఇఓ రమాదేవి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల మనది దానిని కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని అన్నారు. శిథిలమైన పాఠశాల రిపేరుల కోసం ఒక లెటర్ రాసి పంపిస్తే ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. పాఠశాల ఉపాధ్యాయుడు ఎమ్‌డిఎమ్ఎమ్ హక్ మాట్లాడుతూ పాఠశాల లో పిల్లలను చేర్పించండి వారికి చదువు చెప్పి బాధ్యత మదని అన్నారు. ప్రజాప్రతినిధుల సహకారంతో పిల్లలకు మెరుగైన సదుపాయాలు కల్పిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఇఓ2 లీలారాణి, రాష్ట్ర గ్రీనింగ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ కాసు పెంట రెడ్డి, మల్లపాలెం సొసైటీ ప్రెసిడెంట్ కుర్రి సుబ్బారెడ్డి, వార్డు మెంబర్లు కాకాని సురేష్, డబ్బూరి వెంకటేశ్వర్లు, భాగ్యరావు, చిన్నం శ్రీకాంత్ ముస్లిం పెద్దలు తల్లితండ్రులు పాల్గొన్నారు.

షి టాయిలెట్లను ప్రారంభిస్తున్న గ్రామ సర్పంచ్ తదితరులు

## పిల్లలు ఆరోగ్యంగా ఉండాలి

**ప్రజాశక్తి - దుగ్గిరాల**

పరిశుభ్రతను పాటిస్తూ పిల్లలు ఆరోగ్యంగా ఉండాలని సర్పంచ్ బాణావత్ ఖుషి బాయ్ అన్నారు. శుక్రవారం జరిగిన తల్లితండ్రుల ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశంలో మంత్రి నారా లోకేష్ సహకారంతో నెస్లే కంపెనీ సి ఎస్ ఆర్ ఫండ్స్ తో స్థానిక బాలికల హైస్కూల్లో 10 లక్షల రూపాయలతో ఏర్పాటు చేసిన షీ టాయిలెట్‌లను మండల స్థాయి అధికారులు ప్రజాప్రతి ప్రతినిధులతో కలిపి ప్రారంభించారు. నెస్లే కంపెనీ వారికి కృతజ్ఞతలు తెలిపారు. దుగ్గిరాలలో 10 లక్షల రూపాయలతో పేరుకలపూడి గ్రామంలోని పాఠశాలలో ఐదు లక్షల రూపాయలతో షీ టాయిలెట్స్‌ను నెస్లే కంపెనీవారు ఏర్పాటు చేశారు. కంపెనీ ఇటువంటి కార్యక్రమాలు ఇంకెన్నో చేపట్టాలని ఆమె కోరారు. స్థానిక వ్యవసాయ మార్కెటింగ్ యార్డు ఛైర్మన్ ఉన్నం ఝాన్సీ మాట్లాడుతూ పిల్లలు ఆరోగ్యంగా ఎదగటానికి పరిసరాలు పరిశుభ్రత వ్యక్తిగత పరిశుభ్రత ఎంతో అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఐ.సునీత, ఎంపీడీవో ఎ.శ్రీనివాస రావు, మండల విద్యాధికారి కె.శ్రీనివాసరావు బాలికల బాలుర హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు ఎస్.శోభాదేవి, జయ రత్న, రాణి నెస్లే ప్రతినిధులు వసీం అహ్మద్ అనిల్, ఎంపీపీ షేక్ జబీన్ స్థానిక నాయకులు మాజీ ఎంపీపీ వెనిగళ్ళ శ్రీకృష్ణ ప్రసాద్, పర్వతనేని హర్ష, వల్లూరు నరసింహారావు. దేవరపల్లి చంటి బాణావత్ వెంకటేశ్వర నాయక్ పాల్గొన్నారు.

## అమ్మవారి ఆలయానికి వితరణ

**ప్రజాశక్తి - దుగ్గిరాల**

మండలంలోని కంఠం రాజు కొండూరు గ్రామ శివారులలో వేంచేసి ఉన్న శ్రీ మహంకాళి అమ్మవారి ఆలయానికి శుక్రవారం గుంటూరు వాస్తవ్యులు చెన్నం శెట్టి వెంకటేశ్వర్లు రత్నకుమారి దంపతులు, వారి కుటుంబ సభ్యులు 102555 రూపాయలు విరాళంగా అందించినట్లు ఆలయ కార్యనిర్వాహణ అధికారి కె.సునీల్ కుమార్ తెలియజేశారు తెలిపారు. ఈ సందర్భంగా సునీల్ కుమార్ వారి కుటుంబానికి కృతజ్ఞతలు తెలియజేశారు.

## ఆర్‌విఆర్ జెసి అధ్యాపకునికి డాక్టరేట్

ప్రజాశక్తి-గుంటూరు

ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజినీరింగ్ కాలేజి కంప్యూటర్ సైన్స్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ నాగుల్ మీరా సయ్యద్‌కు డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలాం యూనివర్సిటీ, ఇండోర్ డాక్టరేట్ ప్రధానం చేసింది. నాగుల్ మీరా సయ్యద్ 'ఇంప్రూవ్డ్ క్లౌడ్ ఐఓటి సర్వీసెస్ బై ఇంటిగ్రేటెడ్ వర్చువల్ నెట్‌వర్క్స్ ఇంటూ ఎలాస్టిక్ ఆప్టికల్ నెట్‌వర్క్ బిట్వీన్ సిసిఎస్' అనే అంశంపై, అబ్దుల్ కలాం యూనివర్సిటీకి చెందిన డాక్టర్ రాజీవ్ జి.విశ్వకర్మ పర్యవేక్షణలో పరిశోధన చేశారు. ఈ సందర్భంగా నాగుల్ మీరా సయ్యద్‌కు కళాశాల అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, సెక్రెటరీ రాయపాటి గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్, డైరెక్టర్లు డాక్టర్ కె.రవీంద్ర, డాక్టర్ ఎన్.వి.శ్రీనివాసరావు అభినందనలు తెలిపారు.

## మహిళల అభివృద్ధిపై చిప్స్ కాలేజీలో సదస్సు

ప్రజాశక్తి-గుంటూరు

సీతామహాలక్ష్మిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్

చేబ్రోలు హనుమయ్య ఫార్మసీ కాలేజిలో ఎన్ఎస్ఎస్, మహిళా గ్రీవెన్స్ సెల్ ఆధ్వర్యంలో మహిళల సమగ్ర అభివృద్ధి, భావోద్వేగ సమతుల్యత, భద్రత, పోక్సో యాక్ట్ గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రముఖ సైకాలజిస్ట్ సీతా మహాలక్ష్మి జెట్టి పాల్గొని మాట్లాడుతూ ఒక బాలికను శక్తివంతం చేయడం అంటే ఆమెకు కేవలం విద్య ఇవ్వడం మాత్రమే కాదని, ఆమె శారీరక ఆరోగ్యం, మానసిక ధైర్యం, నైతిక విలువలు, ఆర్థిక అవగాహన, నాయకత్వ నైపుణ్యాలు అన్ని రంగాలలో ఎదగడానికి అవకాశాలు ఇవ్వాలన్నారు. అమ్మాయిలు తమపై నమ్మకం పెంచుకునేలా, తమ సామర్థ్యాలను పెంపొందించుకునేలా కుటుంబం, పాఠశాల, సమాజం కలిసి కషి చేయాలన్నారు.మానసిక స్థైర్యం ఒక అమ్మాయి విజయానికి బలమైన పునాది అన్నారు. నేటి ఆధునిక యుగంలో ఒత్తిడి, సందిగ్ధత, సోషల్ మీడియా ప్రభావం వంటివన్నీ ఎదుర్కోవడానికి భావోద్వేగ అవగాహన, స్వీయగౌరవం, ధైర్యం వంటి లక్షణాలు ఎంతో ముఖ్యమైనవని, బాలికలు తమ భావాలను అర్థం చేసుకోవడం, వాటిని వ్యక్తపరచడం, అవసరమైనప్పుడు సహాయం కోరడం నేర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ . విద్యాధర పాల్గొన్నారు.

## 8, 9 తేదీల్లో కిట్స్‌లో స్మార్ట్ ఇండియా హ్యాకథాన్

ప్రజాశక్తి-గుంటూరు

మాట్లాడుతున్న చైర్మన్ కోయి సుబ్బారావు

కిట్స్ కాలేజిలో ఈనెల 8, 9 తేదీల్లో విద్యా మంత్రిత్వ శాఖ ఇన్నోవేషన్ సెల్, ఎఐసిటియు ఆధ్వర్యంలో 8వ ఎడిషన్ స్మార్ట్ ఇండియా హ్యాకథాన (ఎస్ఐహెచ్) నిర్వహిస్తున్నట్లు కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు తెలిపారు. కళాశాలలో జరిగిన మీడియా సమావేశంలో ఆహ్వానపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ మాట్లాడుతూ ఈ హ్యాకథాన్‌కు 21 రాష్ట్రాల నుండి 150 మంది విద్యార్థులు పాల్గొంటున్నారని, గెలిచిన వారికి రూ.1.50 లక్షల బహుమతులు కేంద్ర ప్రభుత్వం ఇస్తుందన్నారు. విద్యార్థులలో సృజనాత్మక ఆలోచన, సమస్యా పరిష్కార సామర్థ్యం, వ్యవస్థాపక స్ఫూర్తి పెంపొందించటానికి దేశ వ్యాప్తంగా ఎస్ఐహెచ్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు.గ్రాండ్ ఫినాలే గుంటూరులోని కిట్స్‌లో జరుగుతుందన్నారు. సమావేశంలో డైరెక్టర్, ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.

## పారిశుధ్య పనులు మెరుగ్గా ఉండాలి

ప్రజాశక్తి-గుంటూరు

ప్రజలతో మాట్లాడుతున్న కమిషనర్

గుంటూరు నగరంలో పారిశుధ్య పనులు మెరుగుపర్చాలని, కేటాయించిన విధుల్లో నిర్లక్ష్యంగా ఉండే కార్మికులు, కార్యదర్శులు, అధికారులపై కఠిన చర్యలు తప్పవని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ప్రజారోగ్య అధికారులకు స్పష్టం చేశారు. శుక్రవారం జేకేసి కాలేజీ రోడ్, ఇన్నర్ రింగ్‌రోడ్, ఆర్టీసి కాలనీ, బాలాజీ నగర్ ప్రాంతాల్లో పర్యటించి పారిశుధ్య, అభివద్ధి పనులను పరిశీలించి, సంబందిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ తొలుత బాలాజీ నగర్‌లో చెత్త సేకరణపై ప్రజలు ఫిర్యాదు చేయగా ప్రజారోగ్య అధికారులు, కార్యదర్శులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో పారిశుధ్య పనుల్లో భాగంగా ఇంటింటి చెత్త సేకరణ, డ్రైన్ల శుభ్రంపై ప్రజల నుండి ఫిర్యాదులు అందుతున్నాయని, కార్మికులు పిన్ పాయింట్‌గా విధులు నిర్వహించేలా కార్యదర్శులు, ఇన్స్పెక్టర్లు పర్యవేక్షణ చేయాలన్నారు. బాలాజీ నగర్‌లో పారిశుధ్య పనుల్లో రెండ్రోజుల్లో మెరుగదల ఉండాలని, చెత్త సేకరణ, డ్రైన్ల శుభ్రం చేసే విధుల్లో నిర్లక్ష్యంగా ఉండే కార్మికులపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎస్‌ని ఆదేశించారు. ఆర్టీసి కాలనీ మెయిన్ రోడ్‌లో డ్రైన్ ఆక్రమణ చేసి ఏర్పాటు చేసిన దుకాణాలను తొలగించాలని పట్టణ ప్రణాళిక కార్యదర్శులను ఆదేశించారు. రోడ్లపై ఉన్న ఆవులను జిఎంసి గోశాలకు తరలించాలన్నారు. ఇన్నర్ రింగ్ రోడ్‌లో ఆక్యుపెన్సీ కోసం దరఖాస్తు చేసిన బహుళ అంతస్తు భవనాన్ని పరిశీలించి, డ్రైనేజిని మేజర్ డ్రైన్‌లోకి కనెక్ట్ చేయాలన్నారు. ఇంజినీరింగ్ అధికారులు నూతన రోడ్లను ఎండ్ టు ఎండ్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రోడ్లు, డ్రైన్ల నిర్మాణ అనంతరం వ్యర్థాలను సదరు కాంట్రాక్టరే తొలగించాలన్నారు. పర్యటనలో డిఈఈలు రమేష్ బాబు, కళ్యాణరావు, ఆర్ఓ సాదిక్ భాష, ఎస్ఎస్ ఆయూబ్ ఖాన్, ఇంజినీరింగ్, ప్రజారోగ్య, పట్టణ ప్రణాళిక అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

# విద్యార్థులు నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలి

ప్రజాశక్తి-గుంటూరు

మాట్లాడుతున్న కలెక్టర్

విద్యార్థులు జీవన నైపుణ్యాలు పెంపొందించుకోవాలని, అందుకు పాఠశాల సరైన వేదిక అని జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా అన్నారు. స్థానిక నగరంపాలెంలోని స్టాల్ గరల్స్ హైస్కూల్లో శుక్రవారం నిర్వహించిన మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్‌లో కలెక్టర్ పాల్గొని విద్యార్థులతో ఆప్యాయంగా ముచ్చటించారు. వారి చదువు, క్రీడలు, ఇతర విషయాల్లో వారి ప్రగతి గురించి మాట్లాడారు. వారి లక్ష్యాలు ఏమిటో అడిగి తెలుసుకుని ప్రోత్సహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 1049 పాఠశాలలుతో సహా, జూనియర్ కళాశాలల్లో తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశం జరుగుతుందన్నారు. విద్యలో ప్రభుత్వం కొత్త మార్పులు తీసుకు వస్తుందన్నారు. సంపూర్ణ ప్రగతి నివేదికలో విద్యార్థి సమగ్ర నైపుణ్యాలు, భావోద్వేగాలు నమోదు చేయటం జరుగుతుందన్నారు. పరీక్షలలో ఫార్మాటివ్ అసెస్మెంట్ చేయడం జరుగుతుందని చెప్పారు. కలలు కనటంతోపాటు, వాటిని సాకారం చేసుకోవాలని అన్నారు. మానవ మెదడుకు చాలా శక్తి ఉందని, దానిని సరైన పద్ధతిలో వినియోగించుకుంటే అద్భుతాలు సృష్టించవచ్చన్నారు. విద్యార్థులను సమగ్రంగా తీర్చిదిద్దటానికి కృషి చేయాలని సూచించారు. సెల్‌ఫోన్లకు విద్యా ర్థులు దూరంగా ఉండాలన్నారు. బాల్య వివాహాలను అరికట్టాలని, బాలికల్లో ఉన్నత విద్య శాతం పెంచాల్సిన అవసరం ఉందన్నారు. నైపుణ్యాలు పెంచుకోవాలన్నారు. ఈ సందర్భంగా బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ పి ప్రసూన, ఉప విద్యాశాఖ అధికారి వెంకటేశ్వరరావు, మండల విద్యా శాఖ అధికారి ఎస్.ఎం.ఎం అబ్దుల్ కుదుష్, నాగేంద్రమ్మ, ప్రధాన ఉపాధ్యాయులు ఆనంద కుమారి, తహసిల్దార్ సుభాని పాల్గొన్నారు.

## యూనిట్లు త్వరగా ప్రారంభం కావాలి

ప్రజాశక్తి-గుంటూరు

వివిధ పథకాల క్రింద మంజూరైన యూనిట్లు త్వరగా ప్రారంభం కావాలని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా అన్నారు. జిల్లా పారిశ్రామిక, ఎగుమతుల ప్రోత్సాహక మండలి (డి.ఐ.ఇ.పి.సి) సమావేశం శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు చేసుకున్న దరఖాస్తులు త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. ఎపిఐఐసి భూములకు సంబంధించిన దస్త్రాలు త్వరగా పరిష్కరించుటకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఏర్పాటు చేస్తున్న యూనిట్లకు రుణాలు అందించడంలో బ్యాంకులు సహకరించాలన్నారు. ప్రభుత్వం యువతకు ఉపాధి అవకాశాలు కల్పించుటకు స్వయం ఉపాధి యూనిట్లు మంజూరు చేయడం జరుగుతుందని, వాటికి రుణాలు మంజూరు చేసి యూనిట్లు ప్రారంభం కావడానికి సహకరించాలని ఆదేశించారు. జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ జయలక్ష్మి మాట్లాడుతూ గత నెల రోజుల కాలంలో 1047 దరఖాస్తులు అందగా 969 దరఖాస్తులకు మంజూరు చేయడం జరిగిందని చెప్పారు. సమావేశంలో కాలుష్య నియంత్రణ మండలి కార్యనిర్వహక ఇంజినీర్ ఎం.డి.నజీనాబేగం, పర్యాటక శాఖ అధికారి రమ్య, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి యు.చెన్నయ్య పాల్గొన్నారు.

## విద్యార్థులు సవాళ్లను ధైర్యంగా స్వీకరించాలి

ప్రజాశక్తి-గుంటూరు

సక్కు మాధవిని అభినందిస్తున్న మలినేని పెరుమాళ్లు

పుల్లడిగుంటలోని మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో స్వయంప్రతిపత్తి హోదా కింద మొదటి పీజీ బ్యాచ్ విజయవంతంగా కోర్సు పూర్తి చేసుకుందని కళాశాల చైర్మన్ మలినేని పెరుమాళ్లు అన్నారు. ఈ సందర్భంగా కాలేజిలో శుక్రవారం నిర్వహించిన సభలో చైర్మన్ మాట్లాడుతూ నాణ్యమైన సాంకేతిక విద్య ద్వారా మహిళా సాధికారత సాధించటానికి కళాశాల నిబద్ధతతో కృషి చేస్తుందని చెప్పారు. స్వయంప్రతిపత్తి హెూదా సంస్థ ప్రగతిశీల విద్యా సంస్కరణలు, పరిశ్రమ-కేంద్రీకత పాఠ్యాంశాలు, విద్యార్థి- కేంద్రీకత మూల్యాంకన వ్యవస్థలను అమలు చేయడానికి వీలు కల్పించిందన్నారు. ముఖ్య అతిథి సక్కు గ్రూప్ డైరెక్టర్, విశిష్ట సామాజిక, సాంస్కృతిక రాయబారి సక్కు మాధవి మాట్లాడుతూ విద్యార్థులు ధైర్యంతో సవాళ్లను స్వీకరించాలని, నిరంతరం ఉత్సుకతతో నేర్చుకోవాలని ప్రోత్సహించారు. వ్యాపారం, సమాజసేవ, కళలలో తన అనుభవం నుండి, నిజమైన విజయం అభిరుచి, పట్టుదల, ఉద్దేశ్యం యొక్క సమ్మేళనం నుండి వస్తుందని చెప్పారు. సాంకేతికత నుండి వ్యవస్థాపకత, సామాజిక అభివద్ధి వరకు ప్రతి రంగంలోనూ మహిళలు మార్పునకు నాయకత్వం వహించగలరని అన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ జె.అప్పారావు, సిఇఒ డాక్టర్ ఆర్.పూర్ణచంద్రరావు విద్యార్థులకు అధ్యాపకులకు అభినందనలు తెలిపారు. అనంతరం కోర్సు పూర్తిచేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు.

## పవర్ లిఫ్టింగ్ పోటీలకు చంద్రిక

ప్రజాశక్తి - మంగళగిరి

ఈ నెల 2 తేదీ నుండి 10 తేదీ వరకు టర్కీలో జరిగే ఏషియన్ సీనియర్ ఎక్యూప్డ్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్షిప్స్‌లో మన భారతదేశము తరపున ఎపి నుండి గుంటూరు జిల్లా మంగళగిరికి చెందిన సీనియర్ అంతర్జాతీయ పవర్ లిఫ్టర్ బొలినేని చంద్రిక ప్లస్ 84 కేజీ విభాగంలో ఎంపికయ్యారు. ఈక్రమంలో పోటీల్లో పాల్గొన డానికి ఆమె వెళ్లారని గుంటూరు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షులు కొమ్మాకుల విజయ భాస్కర రావు, ప్రధాన కార్యదర్శి షేక్ సంధాని శుక్రవారం తెలిపారు. ఈ పోటీల్లో బొలినేని చంద్రిక విజయం సాధించి పతకంతో తిరిగి రావాలని వారు ఆకాంక్షించారు.

పురస్కారం అందుకున్న అధ్యాపకులతో కాలేజి సెక్రెటరీ

## ఐఐసి రీజనల్ మీట్‌లో ఆర్‌విఆర్ జెసికి పురస్కారాలు

ప్రజాశక్తి-గుంటూరు

తమ కళాశాల రీసెర్చ్, ఇన్నోవేషన్ రంగాల్లో సాధిస్తున్న జాతీయస్థాయి విజయాలు విద్యా ప్రమాణాలకు నిదర్శనం అని ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజినీరింగ్ కాలేజి అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ కె.మద్దినేని అన్నారు. ఇన్నోవేషన్‌ను ప్రోత్సహించే లక్ష్యంతో ఏఐసిటిఇ ఇటీవల విజయవాడలో నిర్వహించిన రీజనల్ మీట్‌లో తమ కళాశాల ప్రదర్శించిన ప్రతిభకు ఉత్తమ పోస్టర్ ప్రదర్శన అవార్డు, ఉత్తమ ఇన్నోవేషన్ అంబాసిడర్ అవార్డు దక్కాయన్నారు. ఈ సందర్భంగా పురస్కారాలు అందుకున్న అధ్యాపక బృందాన్ని కళాశాల సెక్రెటరీ రాయపాటి గోపాలకృష్ణ అభినందించారు. కార్యక్రమంలో ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్, డైరెక్టర్లు డాక్టర్ కె.రవీంద్ర, డాక్టర్ ఎన్.వి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.